

# మెహెర్‌బాబా

అవతార్ మెహెర్‌బాబాకే అంకితమైన మాసపత్రిక

సంపుటి :14 సంచిక: 12 హైదరాబాద్ 2015 ఏప్రిల్ పేజీలు 40

Please visit : www.srimeherbaba.com వార్షిక సభ్యత్వం : రూ.100/-

# ఆదర్శం

**విజయనగరం బాబా సెంటర్ ప్రేమికులు స్థానిక ప్రజానీకం దాహార్తిని తీర్చేలాగా ఈ వేసవిలో చలివేంద్ర కేంద్రాన్ని ప్రారంభించామని. ఈ కేంద్రాన్ని 2015 మే 31 దాకా 48 రోజులపాటు నిర్వహించనున్నామని శ్రీ దాసరి వెంకటరావు ఒక ప్రకటనలో తెలిపారు.**



## బాలకృష్ణారావు బాబాలో ఐక్యం

బాబా ప్రేమికులు శ్రీ జె. బాలకృష్ణారావు(87), సికింద్రాబాద్, మార్చి 28న సా. 5.15కు బాబాలో ఐక్యమయ్యారు. నిత్యం అవతారుని నామస్మరణలో గడిపిన బాలకృష్ణారావు ధన్యులు. బాబా నామస్మరణల నడుమ ఆయన అంత్యక్రియలు నిర్వహించారు. ఏప్రిల్ 11న వారి ఇంట్లో బాబా సత్సంగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీ బి. క్రిష్ణయ్య మాట్లాడుతూ శ్రీ కృష్ణారావు ఎంతో నిరాడంబరంగా, నిత్యజీవితంలో అవతారుని సందేశాలను ఆచరణలో అమలుచేయడానికి ప్రయత్నించారని అన్నారు. జంటనగరాలలో ఎక్కడ బాబా కార్యక్రమం జరిగినా శ్రీ కృష్ణారావు తప్పక హాజరయ్యేవారని ఆయన అన్నారు. దక్షిణమధ్య రైల్వేలో ఫైనాన్స్ శాఖలో ఉన్నతోద్యోగిగా పనిచేసి రిటైరయిన శ్రీ క్రిష్ణారావు బాబా కార్యక్రమాల నిర్వహణలో పలువురికి సహాయపతుడుండేవారని స్థానిక బాబా ప్రేమికులు ఆయన సేవలు గుర్తు చేసుకున్నారు.

## మెహెరాబాద్‌లో పసిడి వేడుకలు

మెహెర్‌బాబా 1965 మే 1 నుండి 6 వరకు పూణేలోని గురుప్రసాద్‌లో తన ప్రేమికులకు బహిరంగ దర్శన కార్యక్రమం నిర్వహించి నేటికి 50 సంవత్సరాలు నిండుతున్న సందర్భంగా మెహెరాబాద్‌లో ఆనాటి మధుర స్మృతులను గుర్తుచేసుకునేలా స్వర్ణోత్సవ కార్యక్రమాలను **2015 నవంబరు 13, 14 తేదీలలో** ఏర్పాటు చేసినట్లు ట్రస్టు చైర్మన్ శ్రీ శ్రీధర్ కేల్కర్ ఒక ప్రకటనలో తెలిపారు.

## మెహెర్‌బాబా పత్రిక

మెహెర్ నామ వ్యాప్తికి మీ బంధుమిత్రులలో కనీసం ఒకరిద్దరినైనా ప్రోత్సహించి పత్రిక వార్షిక లేక జీవిత సభ్యత్వం చెల్లింపజేయండి. పత్రిక పది వేల సైన్యంతో సమానమని గమనించగలరు.

# బాబా సందేశం

## Mercy is God's nature

**భగవంతుడు దయగలవాడు. అది ఆయన సహజ లక్షణం.**

**- మెహెర్‌బాబా**


**గౌరవ సంపాదకులు**

**మల్లాది కృష్ణానంద్**

**99595-53218,**

**040-65553218**

**malladisukku@gmail.com**

**వ్యవస్థాపకులు:**

**దశిక ప్రసాదరావు**

**040-65699611**


## లోపలి పేజీలలో...


| | |
|---|---|
| 1. సంపాదకీయం | 5 |
| 2. హెరిటేజ్ ప్రాంగణం | 6-7 |
| 3. గాడేకర్ త్రయం | 8-12 |
| 4. తెలుగు సహవాస్ | 13-18 |
| 5. జన్మ జన్మల ఋణాలు | 19 |
| 6. లార్డ్ మెహెర్ | 20-28 |
| 7. క్రొత్త పుస్తకం | 29 |
| 8. దివ్య చరిత్ర - చలన చిత్రం | 30 |
| 9. మా మాటలు | 31 |
| 10. భగవద్వచనము సదస్సు | 32 |
| 11. మా మాటలు | 33 |
| 12. అష్టోత్తరశత నామావళి | 34-37 |
| 13. జీవిత సభ్యుల వివరాలు | 38-39 |



**ఉత్తర ప్రత్యుత్తరాలకు**

ఎడిటర్,
మెహెర్‌బాబా,
గోదావరి గార్డెన్స్, యాప్రాల్,
ప్లాట్ నెం. 32,
జె.జె. నగర్‌కాలనీ ,
సికింద్రాబాద్-500 087
ఫోన్: 99595-53218


### మనవి

**మీ వ్యాసాలు, లేఖలు ఇతర సమాచారం మాకు ప్రతినెల 4వ తేదీ లోపల అందేలా పంపవలసింది. పత్రికను ప్రతినెల 19 లేదా 20వ తేదీలలో పోస్టు చేస్తున్నాం. 25వ తేదీలోగా పత్రిక మీ ముంగిట ఉంటుంది.**

Please visit : www.srimeherbaba.com

# చల్లపల్లి సెంటర్ స్వర్ణోత్సవాలు

చల్లపల్లి బాబా సెంటర్ స్వర్ణోత్సవాలు 2015 ఆగస్టు 29, 30 తేదీలలో ఘనంగా నిర్వహించనున్నామని కార్యదర్శి శ్రీ పి.వి. రమణారావు ఒక ప్రకటనలో తెలిపారు. కాగా, ఈ వేడుకలలో భాగంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలలో పాల్గొనగోరువారు తమ వివరాలు త్వరలో పంపవల్సిందిగా ఆయన కోరుతున్నారు.

# ఆంధ్రా రెస్టు హౌస్ జలనిధి

గెస్టు హౌసుకు అవసరమైన నీటిని ట్యాంకర్ల ద్వారా కొనుగోలు చేస్తున్నామని, ఇందుకు అధిక మొత్తంలో ఖర్చు అవుతోందని కార్యదర్శి శ్రీనివాస్ తెలిపారు. ఆర్థిక స్తోమత గల బాబా ప్రేమికులు ట్యాంకర్ల ద్వారా నీటిని కొనుగోలు నిమిత్తం ఏర్పాటు చేసిన జలనిధికి తగిన విరాళాలు పంపి సహకరించవల్సిందిగా శ్రీ వై. శ్రీనివాస్ (99 12 199978) కోరుతున్నారు.

### వేసవి రద్దీ..

వేసవికాలంలో మెహెరాబాద్‌లో- డి హాస్టలు, అలాగే యంపిఆర్‌లో కూడా బస ఏర్పాట్లు 2015 మే 25 దాకా వుండవు. ఆంధ్రా గెస్టు హౌసు బాబా ప్రేమికులతో రద్దీగా వుందని, పాశ్చాత్య బాబా ప్రేమికులు కూడా ఇక్కడే బస చేయడానికి ఇష్టపడుతున్నారని సమాచారం!!

# ఖమ్మం సెంటర్ 52వ వార్షికోత్సవం

ఖమ్మం బాబా సెంటర్ 52వ వార్షికోత్సవం 2015 ఏప్రిల్ 26న నిర్వహిస్తున్నట్లు కార్యదర్శి ఒక ప్రకటనలో తెలిపారు. బాబా ప్రేమికులు అధిక సంఖ్యలో ఈ కార్యక్రమంలో పాల్గొనవల్సిందిగా ఆయన కోరుతున్నారు.

## హెల్ప్‌లైన్

ప్రతి నెలా 25లోగా మెహెర్‌బాబా పత్రిక పోస్టులో మీకు అందేలా తగిన ఏర్పాట్లు చేస్తున్నాం. ఐతే, ఏ కారణంగానో నెల చివరిదాకా కూడా పత్రిక పోస్టులో మీకు రాకుంటే హైదరాబాద్ బాబా ప్రేమికులు శ్రీ వి.ఆర్.కె.శాస్త్రి (98492 42284), శ్రీ కాగిత రామ్ (99481 28207) లను సంప్రదించగలరు. **మీ ఇ-మెయిల్ అడ్రస్ పంపితే పత్రికను ఇంటర్‌నెట్‌లో పంపగలం.**

సంపాదకీయం

# సూచన

గాడ్ స్పీక్స్.
బాబా ప్రేమికులు చాలామంది ఈ గ్రంథాన్ని చూసే వుంటారు.
పలువురు ఈ గ్రంథం గురించి తరచు మాట్లాడుతూ వుంటారు.
అవతార్ మెహెర్‌బాబా ఈ గ్రంథాన్ని ప్రతి ఒక్కరూ తప్పక చదవమని ఆదేశించారు. అన్ని పుస్తకాల మాదిరి ఈ పుస్తకం చదవగానే సులువుగా అర్థం కాదని బాబాకు తెలుసు. అందుకే ఏమన్నారు..మీకు అర్థమయినా..కాకపోయినా..ఈ పుస్తకాన్ని కొని దగ్గర్లో వుంచుకోమన్నారు. మెహెర్‌బాబా మానవాళికి అందించిన అపురూప కానుక భగవద్వచనం. ఆధ్యాత్మిక సాహిత్యంలో ఈ గ్రంథానికి సాటి మరొకటి లేదని చెప్పాలి. భగవద్వచనం గ్రంథంలో ఆత్మ యొక్క చైతన్య పరిణామ క్రమం, సృష్టి ఆవిర్భావం, ఆత్మసాక్షాత్కారం, తదితర అంశాలను అవతార్ మెహెర్‌బాబా ఎంతో వివరణాత్మకంగా చెప్పారు. **ఉగాది పండుగ రోజున,** మార్చి 21న జూబ్లిహిల్స్ బాబా కేంద్రంలో భగవద్వచనం గ్రంథంపై ఏర్పాటు చేసిన ఒక ప్రత్యేక సదస్సులో పాశ్చాత్య బాబా ప్రేమికుడు, డాక్టర్ వార్డ్ పార్క్స్, మెహెరాబాద్, ప్రసంగించారు.
తెలుగునాట ఒకప్పుడు బాబా ప్రేమికులు చాలామంది గాడ్ స్పీక్స్ గ్రంథం గురించి కూలంకషంగా చర్చించేవారు. శ్రీ జియస్‌యన్ మూర్తి, శ్రీ చాగంటి సుబ్బారావు, శ్రీ యంబిజి శాస్త్రి, శ్రీ బాల గోపాల భాస్కరరాజు, శ్రీ త్రినాథ్ రథో, శ్రీ పి. రామచంద్రన్, శ్రీ జివిజి చంద్రమౌళేశ్వరరావు...ఇలా చాలామంది పెద్దలు చిన్నిపాటి సత్సంగ్‌లలో కూడా, వారు ప్రసంగించవల్సివస్తే గాడ్ స్పీక్స్‌లోని అంశాలనే ఎంచుకునేవారు. శ్రీ జియస్‌యన్, చాగంటి, బాల గోపాల భాస్కరరాజు తదితరులు అమెరికా తదితర దేశాలలోని బాబా ప్రేమికుల ఆహ్వానం మేరకు అక్కడికి వెళ్ళి గాడ్ స్పీక్స్‌పై ప్రసంగించిన విషయాన్ని ఈ సందర్భంలో మనం గుర్తు చేసుకోవాలి. 1950వ దశకంలోనే అవతారుని ఆదేశాల మేరకు ఈ గ్రంథాన్ని తెలుగులో అనువదించి ప్రచురించిన ప్రాంతమిది. కానీ, నేడు ఈ పరిస్థితి భిన్నంగా వుంది కదా!! నేడు ఈ గ్రంథంపై సాధికారంగా మాట్లాడేవారి సంఖ్యకు కొదవ లేదు కానీ సంఖ్యాపరంగా చాలా స్వల్పం. ఇదే ఒరవడి కొనసాగితే ప్రమాదకరమే. కాబట్టి, జూబ్లి సెంటర్ మాదిరి ఇతరులు కూడా ఈ విషయమై ప్రత్యేక శ్రద్ధ కనబరచాలి.
ఆలస్యం ఏ మాత్రం తగదని మా అభిప్రాయం. ఆయా బాబా కేంద్ర కార్యనిర్వాహకులు తగిన చర్యకు ఉపక్రమించాలని మనవి!
ఇదొక సూచన మాత్రమే సుమీ !!

# హెరిటేజ్ ప్రాంగణం

## మెహెర్ చంద్ర, భండార్కర్ రోడ్, పూణే



ఈ పురాతన వారసత్వపు భవన ప్రాంగణం సూమారు ఒక ఎకరం విస్తీర్ణంలో వుంది. ఇది పూణే మహానగర నడిబొడ్డున భండార్కర్ వీధిలో వుంది.
ఇంటి పేరు మెహెర్ చంద్ర. సుమారు అర్ధ శతాబ్దం క్రితం నిర్మించిన ఈ ఇంటిలో బాబా ప్రేమికులు శ్రీ రాంచంద్ర గాడేకర్ నివాసమున్నారు. ఆయన మహారాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ డైరక్టర్‌గా పనిచేసిన రోజుల్లో నాటి జిల్లా యంత్రాంగం నుండి ఈ ఇంటిని కొనుగోలు చేశారు.
నేడు రాంచంద్ర గాడేకర్ గారి కుమారుడు, శ్రీ దిగంబర్ గాడేకర్ ఈ ఇంటిలో వుంటున్నారు. మెహెర్‌బాబా ఈ ఇంటిని పలుమార్లు సందర్శించారు. ఒక సందర్భంలో బాబా తనకెంతో ఇష్టమైన నీల్‌కాంత్ మస్తును 8 రోజులుపాటు ఈ ఇంటిలో వుంచారు. నీల్‌కాంత్ మస్తు హిమాలయ శ్రేణుల్లో వుండేవాడని, ఆతను ఐదారు భూమికలలో వున్న ఉన్నత స్థాయి వాడని బాబా వివరించారు.
ఆ మస్తుతో బాబా ఈ ఇంట్లో ఒక రోజు రాత్రంతా ఉండి మస్తు సాంగత్యం చేశారు. అంతేకాదు, 1959 మార్చి 1న శివరాత్రి పర్వదినాన మెహెర్‌బాబా ఈ ఇంటికి చివరిసారిగా వచ్చారు. ఆనాడు లింఫ్ గ్లాండు కాన్సర్‌తో బాధపడుతూ ఆఖరిఘడియల్లో వున్న రామ్‌చంద్ర గాడేకర్ మంచం ప్రక్కనే బాబా కూర్చున్నారు.




పవిత్రమైన శివరాత్రి పండుగ రోజున పరమ శివుడు నీ దగ్గరకు వచ్చాడు..
మనసారా దర్శించుకోమని ఆయనకు బాబా అభయమిచ్చారు.
ఇలా .. ఎన్నో విశేషాలు గల ఈ పురాతన భవనానికి ఎన్ని రిపేర్లు అవసరమైనా, అవతారుడు పాదస్పర్శతో పునీతమైన ఈ ప్రాంగణాన్ని భక్తితో, ప్రేమతో, ఒక వారసత్వపు కట్టడంగా భద్రపరిచారు. నేడు ఈ ఇంట్లోనే వుంటున్న శ్రీ దిగంబర్ గాడేకర్‌ని మెహెర్‌బాబా ప్రతినిధి ఇటీవల కల్సినప్పుడు ఈ ప్రాంగణం గురించి ఎన్నో విశేషాలు చెప్పారు.
ఆనాటి మా మాటా-మంతి మెహెర్‌బాబా పాఠకులకు ప్రత్యేకంగా ఈ సంచికలో అందిస్తున్నాం. వీలుంటే ఈ దఫా మీరు పూణే వెళ్ళితే, ఈ ప్రాంగణాన్ని సందర్శించే ప్రయత్నం మీరూ తప్పక చేయ్యండి.
ఐతే ఒక్కమాట, మీ రాక గురించి దిగంబర్ గాడేకర్ గారికి
ఫోన్: 020-2565 0145, 088888 99989 ముందుగా తెలియజేయండి.
ఈ చిన్ని జాగ్రత్త వయస్సురీత్యా పెద్దవారైన దిగంబర్ దంపతులకు ఎంతో మేలు చేసినట్లౌతుంది.
రామ్‌చంద్ర గాడేకర్, ఆయన తండ్రి కానోజ్ గాడేకర్, అలాగే దిగంబర్ గాడేకర్‌ల గురించి, న మే భక్త: ప్రణశ్యతి గ్రంథంలో చాలా వివరంగా గ్రంధస్తం చేయడమైంది. పాఠకులకు సౌలభ్యం కోసం, ఈ సంచికలో మూడుతరాల గాడేకర్‌ల గురించి సంక్షిప్త సమాచారం అందజేస్తున్నాం.
దయచేసి పరిశీలించండి!!

# గాడేకర్ త్రయం




ఈ తరం తెలుగు బాబా ప్రేమికులందరికీ డా॥ దిగంబర్ గాడేకర్ సుపరిచితులు. గాడేకర్ వంశీయుల పేరు చెబితేనే మేను పులకరిస్తుంది. అవతారుని ఎడల వారి ప్రేమ నిరుపమానమైనది. గత మూడు తరాలుగా గాడేకర్ వారసులు అవతారుని ప్రేమ-సేవలలో సేద తీరిన వైనం ఈ తరం తప్పక తెలుసుకోవాలి. ఉత్తరప్రదేశ్‌లోని లక్నో కేంద్ర విశ్వవిద్యాలయ ఉప-కులపతి (వైస్-ఛాన్సలర్)గా డా॥ దిగంబర్ గాడేకర్ పదవీ విరమణ చేశారు. అంతకిత్రం, జియాలజిస్టుగా, భారత ప్రభుత్వరంగ సంస్థ ఓ.యన్.జి.సి.లో, అలాగే ముప్పై సంవత్సరాలకు పైగా బరోడా విశ్వవిద్యాలయంలో జియోలజీ శాఖ అధిపతిగా ఆయన పనిచేశారు. వీరి తండ్రి రామచంద్ర గాడేకర్, 19 సంవత్సరాల వయస్సులో మెహెర్‌బాబాను మెహెరాబాద్‌లో తొలిసారిగా దర్శించుకుని, కడదాకా ఆయన నామస్మరణలో తరించాడాయన. సాక్షాత్తూ కలియుగావతారుడు అవతార్ మెహెర్‌బాబా **"భక్తశిరోమణి గాడేకర్ సాహెబ్ కీ జై"** అని ఆయన్ని ప్రశంసించాడు.

రామచంద్ర గాడేకర్ తండ్రి కానోజ్ గాడేకర్.

కానోజ్ గాడేకర్ ఒక నిరుపేద హరిజనుడు.

బాబా పాదాలకు చెప్పులు కుట్టి ఇచ్చి, ఆయన మెప్పు పొందిన ధన్యుడాయన.

అది 1922 వ సంవత్సరం. అప్పటికి రామచంద్ర గాడేకర్‌కి 19 సంవత్సరాల వయస్సు. తరచు కడుపు నొప్పితో బాధపడుతుండేవారు.

ఆరోగ్యం బాగా ఉండేది కాదు.

ఎంత వైద్యం చేయించినా కడుపు నొప్పి నయం కాలేదు.

ఒక రోజున తన తండ్రి సలహా మేరకు,

మెహెర్‌బాబాను మెహెరాబాద్‌లో దర్శించుకున్నారు.

మెహెర్‌బాబాకు తన కడుపు నొప్పి గురించి చెప్పుకుందామని

బాబా దర్శనార్థం వచ్చాడు.
క్యూలో నిల్చున్న రామ్‌చంద్ర గాడేకర్‌కు బాబాను దర్శించుకునే సమయంలో తాను వచ్చిన అసలు విషయం మరిచిపోయాడు.
ఎందుకు ఇలా వచ్చావ్? ఏం కావాలని? బాబా అడగ్గానే..
'భగవత్ సాక్షాత్కారం' కావాలి బాబా అని ముక్తసరిగా అన్నాడట.
బాబా ఆశ్చర్యంతో, ఆ మాటకు అర్థం తెలుసా? అని ఎదురు ప్రశ్నించి,
ఆయన వచ్చిన పనిని బాబానే గుర్తుచేసి, తన దగ్గరున్న మందు గోళీలు ఇచ్చి పంపారు.
ఆ దరిమలా మళ్ళీ కడుపు నొప్పి రాలేదని, ఆరోగ్యంగా వున్నాడని చెప్తారు.
ఆ రోజుల్లో మెహెర్‌బాబా ఎంతో మధురంగా పాటలు పాడేవారు.
గంభీరంగా ఎన్నో సందేశాలు ఇచ్చేవారు.
మెహెరుడి కమ్మని గాత్రం మా నాన్న గారిని ఎంతో ఆకర్షించిందని
ఆ మాటలు తమతో తరచు చెప్పేవారని దిగంబర్ గాడేకర్ తన జ్ఞాపకంగా చెప్పారు.
మెహెరాబాద్‌లో బాబా నిర్వహించిన హజ్రత్ బాబాజాన్ హైస్కూలులో
టీచర్‌గా రామచంద్ర గాడేకర్ కొంతకాలం పనిచేశాడు.
రామచంద్ర గాడేకర్ వివాహానికి బాబా స్వయంగా హాజరయ్యారు.
విశేషం ఏమంటే పెళ్ళి అయ్యాక బాబా రామచంద్ర గాడేకర్‌ని
బ్రహ్మచర్యం పాటించమన్నారు.
బాబా ఆదేశాల్ని తు.చ. తప్పక ఆచరించాడాయన.
మెహెరాబాద్‌లో హజ్రత్ బాబాజాన్ స్కూలు మూసివేశాక
పూణేలో బి.ఇ.డి కోర్సు చేసి, విద్యాశాఖాధికారిగా మహారాష్ట్రలోని పలు జిల్లాల్లో ఆయన పనిచేశాడు. ఆయన ఏ ప్రాంతంలో పనిచేసినా అక్కడ బాబా సెంటర్లను నెలకొల్పి బాబా నామ వ్యాప్తికి విశేషంగా కృషి చేశాడు.
1947 ప్రాంతంలో, భారత స్వాతంత్ర్యానంతరం,
ఆయన్ని పూణేకు ట్రాన్స్‌ఫర్ చేశారు.
పూణేలో ప్రభుత్వ సాంఘిక సంక్షేమ శాఖ ఏర్పాటు చేయడంలో ఆయన ప్రధాన పాత్ర పోషించాడు. మహారాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ అధిపతిగా ఆయన పనిచేశారు. రామ్‌చంద్ర గాడేకర్ గొప్ప విద్యావంతుడు. సున్నిత మనస్కుడు. చక్కని గళం ఆయన సొంతం. అవతారునిపై ఎన్నో మధుర గీతాలు ఆయన రాసి ఆలాపించాడు. చాలా నెమ్మదిగా, మృదువుగా మాట్లాడేవాడు. ఆయన రాసిన పాటలు ఎంతో మధురంగా ఉండేవి. అంతేకాదు. ప్రేమ, భక్తి, రాగ, భావయుక్తంగా వుండేవి. తన దగ్గర పనిచేసే జవాను ఇంటికి వెళ్ళి బాబా భజన చేయడానికి

సంతోషించేవాడు. ఆఫీసు పని మినహాయిస్తే, మిగిలిన సమయమంతా బాబా కోసం బాబా నామ వ్యాప్తికోసం తపించేవాడాయన.

పూణేలో తొలి మెహెరుడి సెంటర్ 1947 ప్రాంతంలో వీరి ఇంట్లోనే ప్రారంభమయింది. ప్రొఫెసర్ సి.డి.దేశ్‌ముఖ్, డా॥ అబ్దుల్ ఘనీ తదితరులు ఇక్కడ ఏర్పాటు చేసిన బాబా కార్యక్రమాలలో పాల్గొన్నారు.

రాంచంద్ర గాడేకర్ ద్వారా బాబా పరిధిలోకి వచ్చినవారు ఎందరో వున్నారు.

శ్రీ కె.కె. రామక్రిష్ణన్ కూడా అందులో ఒకరని చెప్పాలి.

పూణేలోని వీరి ఇల్లు ..మెహెర్ చంద్రకు బాబా పలుమార్లు విచ్చేశారు.

రామ్‌చంద్ర గాడేకర్ వృధ్ధాప్యంలో లింఫ్‌గ్లాండ్స్ క్యాన్సర్‌తో చాలా బాధ అనుభవించారు.

ఇప్పటిలా కాన్సర్‌కు సరైన మందుల్లేవు. వైద్య శాస్త్రం బాగా అభివృద్ధిచెందని రోజులవి. శరీరం లోపలికి ఎక్సెరే కిరణాలు పంపేవారు.

చాలా బాధ అనుభవించాడాయన.

ఈ సమయంలోనే మెహెరాజాద్‌లో బాబా సమక్షంలో కొన్ని రోజులు గడిపేందుకు రామ్‌చంద్ర దంపతులను బాబా ప్రత్యేకంగా ఆహ్వానించారు.

అతనికి ఇచ్చే మందులు వేళకు ఇయ్యమని, అతను నాకెంతో కావల్సినవాడని బాబా మా అమ్మను హెచ్చరించారు.

రామ్‌చంద్ర త్వరలో నన్ను చేరతాడని బాబా హెచ్చరించారు.

మెహెరాజాద్ వదలి తిరిగి పూణేకు ట్యాక్సీలో తిరుగు ప్రయాణ సమయంలో బాబా స్వయంగా వారి కారు దాకా వచ్చి వారికి వీడ్కోలు పలుకుతూ...

**'భక్త శిరోమణి గాడేకర్ సాహెబ్‌కీ జై"**

అని గొంతెత్తి బిగ్గరగా జయజయనాదాలు చేయమని సాక్షాత్తూ భగవంతుడు, అవతారమూర్తి తన మండలి సభ్యుల్ని ఆదేశించారు.

పూణే తిరిగొచ్చాక, ఆయన ఆరోగ్యం మరింత క్షీణించింది.

1959 మార్చి 12న రాంచందర్ గాడేకర్ బాబాలో ఐక్యమయ్యారు.

అంతకుముందు, బహుశా మార్చి ఒకటో తేదీన బాబా బొంబాయికి వెళ్తూ పూణేలోని వీరి ఇంటికి మండలి సభ్యులతో కల్సి వచ్చారు.

ఆ రోజు మహా శివరాత్రి పర్వదినమైంది.

బాబా నేరుగా రామ్‌చంద్ర గాడేకర్ గదిలోకి వెళ్ళారు.

మండలివారందరినీ ఇంటి బయటనే వేచి వుండమన్నారు.

మా అమ్మని కూడా బయట వేచి వుండమన్నారు.

బాబా మా నాయన ఎదుట నిల్చొని
ఈ రోజు శివరాత్రి. పరమేశ్వరుడు నీ ఎదుట నిలుచున్నాడు.
తనివితీరా దర్శించుకోమన్నారు.
పది నిముషాల తర్వాత బయటకు వస్తూ,
నిరంతరం నా నామజపం చేసుకోమని మా నాన్నతో అన్నారు.
దాంతో నొప్పి తెలియకుండా వుండేదుకు డాక్టర్లు ఇచ్చే నిద్రపోయేందుకై ఇచ్చే
మత్తు మందులు తీసుకోవడం ఆపివేశాడు.
ఆ మందులు వాడితే నిద్రలోకి జారిపోతానని,
బాబా నామస్మరణ చేయడం కుదరదని ఆయన మందులు వాడటం మానివేశాడు.
ఆ సమయంలో నేను కాలిఫోర్నియాలోని బర్కిలీ విశ్వవిద్యాలయంలో
చదువుకుంటున్నాను. ఇంట్లో మా అమ్మ, నా చెల్లెలు మాత్రమే వున్నారు.
ఇద్దరూ ఆడవాళ్ళు. తండ్రి చూస్తే చావు బ్రతుకుల మధ్య వున్నాడు.
ఏ క్షణమైనా ఏమైనా జరగవచ్చు అనేలా వుంది.
చాలా భయంగా వుంది బాబా.. నీవేమో బొంబాయికి
వెళ్తున్నావు. ఏమైనా జరగరానిది జరిగితే ఏం చేయాలో పాలుపోవడం లేదని
మా అమ్మ ధైర్యం చేసి బాబాతో నేరుగా అనింది.
ఏమీ భయం లేదని బాబా భరోసా ఇచ్చారు.
ఆ దరిమలా సుమారు వారం రోజులు తర్వాత
మార్చి 11 అర్ధరాత్రి బాబా నామస్మరణలోనే రామచందర్ కన్నుమూశారు.
బాబాకి ఈ విషయం ఫోన్లో తెలియజేశారు.
ఆ రోజుల్లో ఫోన్లు ఇప్పటిలా లేవు.
పోస్టాఫీసుల్లో మాత్రమై ఫోన్లుండేవి.
నా చెల్లెలు ఫోన్‌లో మండలివారితో మాట్లాడింది.
హిందూ ధర్మ ఆచారాల ప్రకారం అంత్యక్రియలు మా అమ్మను నిర్వహించమని
బాబా ఆదేశించారు.
అస్తికలు భద్రపరచమన్నారు.
ఆ దరిమలా ఏప్రిల్ 6న, బాబా మెహెరాబాద్‌కు వస్తూ
మా అమ్మవాళ్ళను నాన్నగారి అస్తికలను తమతో తీసుకురమ్మన్నారు.
మెహెరాబాద్‌లో టేబుల్ హౌస్‌కు దగ్గరలో వున్న పురుష మండలి సమాధుల దగ్గర
ముందుగా తీసివుంచిన గోతిలో రామ్‌చంద్ర గాడేకర్ అస్తికలను
బాబా స్వయంగా భూమిలో ఉంచి అనంతరం పుష్పగుచ్ఛం ఉంచారు.

అనంతరం మా తండ్రిగారి సమాధి దగ్గర తన మండలి సభ్యులందర్నీ ప్రణమిల్లి
పుష్పాలుంచమన్నారు బాబా. ఆనాడు మండలి సభ్యులతోపాటు,
అప్పటి బాబా ట్రస్టు చైర్మన్ శ్రీ టి. కుటుంబ శాస్త్రి గారు కూడా వున్నారు.
గాడేకర్ అదృష్టవంతుడు. ఆయన అంత్యక్రియలు స్వయంగా అవతారుడు
నిర్వహించాడన్నారు బాబా.
తిరిగి నేను 700 సంవత్సరాల తర్వాత వచ్చే అవతారకాలంలో గాడేకర్ తిరిగి
జన్మిస్తాడని, అతను నాలో బ్రహ్మైక్యం చెందాడని బాబా మా అమ్మతో చెప్పారు.
అమెరికాలో వున్న నాకు బాబా కేబుల్ పంపారు.
Be Happy. Your father has come to me." అని బాబా కేబుల్‌లో పేర్కొన్నారు.
బాబా ఆదేశాల ప్రకారం, ఆయన ఆనందంగా ఉండమన్నారని చెప్పి,
ఆ కేబుల్ చదువుకుని, చాక్లెట్లు కొనుక్కుని నోట్లో వేసుకున్నాను.
నా మిత్రులకూ చాక్లెట్లు పంచాను.
ఇక్కడ మరో విషయం గమనించాలి.
రామచంద్ర గాడేకర్ ప్రభుత్వ అధికారిగా ఎన్నో ఉన్నత పదవులలో పనిచేశాడు.
కానీ, ఆయన మరణించిన సమయంలో,
దహన సంస్కారాలకు కూడా తగిన డబ్బు ఇంట్లో లేదు.
ఇది తెలిసిన మెహెర్‌బాబా తన ప్రేమికుల చేత విరాళాలు సేకరింపజేసి,
సుమారు 500 రూపాయలు అంత్యక్రియల కోసం అందజేశారు.
ఆయనకు వచ్చే జీతం అంతా సాధారణ కుటుంబ పోషణకు పోగా,
మిగిలినదాన్నంతా బాబా కార్యక్రమాల ఏర్పాటుకు ఖర్చు చేశేవాడు.
అలాగే బాబా రాసిన గ్రంధాలు...డిస్కోర్సెస్, గాడ్ స్పీక్స్,
ఇలా పలు గ్రంధాలు కొనుగోలు చేసి బాబా నామ వ్యాప్తిలో భాగంగా
పలువురు పెద్దలకు, పిన్నలకు విశేషంగా అందజేసేవాడు.
ఆయన పి.ఎఫ్‌లో నుండి రుణం తీసుకుని ఇలాంటి ధార్మిక, సాహిత్యసేవ చేసేవాడని
దిగంబర్ గాడేకర్ చెబుతుంటే ఆశ్చర్యం వేస్తుంది.
భగవంతుడు మానవరూపధారిగా మన మధ్యకు వచ్చినప్పుడు
ఎందరు ఆయన్ని నమ్మి తరిస్తారు?
ఈ ప్రశ్నకు జవాబుగా బహు కొద్దిమందేనని ఎలాంటి సందేహం లేకుండా చెప్పొచ్చు.
ఆ బహు కొద్దిమందిలో రామచంద్ర గాడేకర్ అగ్రభాగాన నిలుస్తాడని చెప్పాలి.
రామచంద్ర గాడేకర్ ధన్యుడు.
గాడేకర్ వంశీయులూ ...ధన్యులని ముగించుదాం!!

# తెలుగు సహవాస్



మెహెరాబాద్‌లో బాబా సమక్షంలో తెలుగు సహవాస్ 1955 నవంబరు 11 నుండి 16 దాకా నిర్వహించారు. ఆనాడు బాబా అనేక ఆధ్యాత్మిక విషయాలు విచ్చేసిన సహవాసీలతో ముచ్చటించారు. ఆ విషయాలను మెహెర్‌బాబా మాస పత్రికలో 2014 ఆగస్టు నుండి ధారావాహిక సీరియల్‌గా ప్రచురిస్తున్నాం. ఈ నెల సంచికతో తెలుగు సహవాస్ సీరియల్ ముగుస్తుంది. కాగా, మే మాసం నుండి తెలుగు సహవాస్ తర్వాత ప్రారంభమైన హిందీ సహవాస్ గురించి ధారావాహికంగా పాఠకుల విన్నపం మేరకు ప్రచురించనున్నాం. దయచేసి పరిశీలించండి.

సాక్షాత్తూ అవతారుని సమక్షంలో వారం రోజులపాటు జరిగిన ఈ సహవాస్ నేటి తరం పాఠకులకు ఎన్నడూ వినని విషయాలు తేటతెల్లమౌతాయి. మెహెర్‌బాబా పాఠకులకు ఇదొక చక్కని జ్ఞాపిక. భద్రపరుచుకోండి!! భావి తరాల కోసం!!

❊❊❊

**గత సంచిక తరువాయి –**

ఈ విషయాలు భగవద్వచనంలో కూడా నేను చెప్పలేదన్నారు బాబా. మనకు తెలియకుండానే ప్రతి క్షణం శ్వాస తీసుకుంటున్నాం కదా అన్నారు బాబా. గాలిని లోనికి తీసుకుంటూ బయటకి వదులుతున్నాం. ఇది నిరంతరం క్షణమైనా ఆపకుండా,

మనకు ఏమాత్రం తెలియకుండానే జరుగుతున్న శ్వాసక్రియ. ఒక్క క్షణం కూడా
ఈ ప్రక్రియ ఆగదు, ఇది మనందరికీ తెలుసు. మనకు తెలియకుండానే
గాలిని లోనికి తీసుకుని, బయటకు వదులుతున్నాం. మంచి నిద్రలో కూడా మన శ్వాస
క్రియకు ఆటంకం వుండదు. ఇది మన నిత్యం జీవితంలో ఒక భాగం.
శ్వాస ఆగిందంటే, దేహం వదిలినట్లే.
అదేమాదిరిగా భగవంతుడు మనందరికీ శ్వాసకన్నా దగ్గరగా వున్నాడు.
కానీ, ఆ విషయం మనం గమనించడం లేదన్నారు.
ఎప్పుడయితే మనం ప్రేమ ద్వారా భగవంతుడిని తెలుసుకోవాలని
ప్రయత్నిస్తామో అప్పుడు భగవంతుడు మన శ్వాస కన్నా దగ్గరగా
వున్నాడన్న సంగతి తెలిసొస్తుందన్నారు బాబా.
ఎన్నో సంవత్సరాలుగా నా దగ్గరగా వున్న మండలివారికి కూడా
ఈ విషయమై సరైన అవగాహన లేదన్నారు.
ఆ తర్వాత సుమారు అరగంట సేపు సహవాసీలు
భజన గీతాలు ఆలాపించారు.
అహ్మద్‌నగర్ నుంచి ఆదీ-కె-ఇరానీ తీసుకొచ్చిన కొంతమంది ప్రేమికులు
బాబాకు దగ్గరగా కూర్చున్నారు.
నాగపూర్ నుంచి వినూ ఖేర్ ఆయన భార్య కూడా ఆ రోజున
బాబా దర్శనం కోసం వచ్చారు.
సహవాసీలలో కొందరికి బాబా వ్యక్తిగత ఇంటర్వ్యూలను
ఆ రోజు సాయంత్రం 5.45 దాకా ఇచ్చారు.
ఆ తర్వాత మెహెరాజాద్‌కు బయల్దేరారు.
నవంబరు 16 ఉదయం 7.30 నిముషాలకల్లా
సహవాసీలందరూ పింపల్‌గాం మెహెరాజాద్‌కు చేరుకున్నారు.
గతంలో గుజరాతీ గ్రూపు మాదిరిగానే
తెలుగువారందర్నీ బాబా తాను ఏకాంతవాసం చేసిన కొండపైకి తీసుకెళ్ళారు.
ఆ తర్వాత అదే రోజు ఉదయం 11 గంటలకల్లా మెహెరాబాద్‌కు తిరిగి వచ్చేశారు.
బాబా 12.15 నిముషాలకు మెహెరాజాద్ నుండి మెహెరాబాద్‌కు వచ్చారు.
బాబా సహవాసీల ఎదుట కూర్చున్నప్పుడు కుటుంబశాస్త్రి గారు లేచి నిలబడి
మండలి సభ్యులందర్నీ తెలుగువారికి పరిచయం చేస్తే బాగుంటుందని సూచించాడు.
బాబాకెందుకో ఈ సూచన నచ్చలేదు.
అయినప్పటికీ మండలివారిని పేరు పేరునా పిలిచినప్పుడు
ఒక్కొక్కరే లేచి నిలబడమన్నారు.

ఆ తర్వాత పరిచయ కార్యక్రమం ప్రారంభమైంది.
ముందుగా... గుస్తాద్‌జీని పరిచయం చేస్తూ,
గుస్తాద్‌జీ నా దగ్గర ఎన్నో సంవత్సరాలుగా వుంటున్నాడన్నారు.
మొదట్లో సాయి ఆశ్రమంలో వున్నాడన్నారు.
ఆ సమయంలో సుమారు 3 సంవత్సరాలు ఆయనకి సరైన తిండి,
వేళకు నిద్రలేక ఎముకల గూడులాగా తయ్యారయ్యాడన్నారు.
ఆ తర్వాత సాకోరీలోని ఉపాసనీ మహారాజ్ ఆశ్రమంలో మహారాజ్ సేవలో
చాలా కాలం గుస్తాద్‌జీ గడిపాడన్నారు.
ఆ తర్వాత తన వద్దకు వచ్చాడని బాబా వివరించారు.
ఆ పిదప కైకోబాదుని పరిచయం చేశారు.
అతని గురించి మీకందరికీ తెలుసు.
అనేకమార్లు కైకోబాద్ గురించి మీకు చెప్పానన్నారు.
ఆ తర్వాత డాంకిన్‌ని పరిచయం చేస్తూ,
ఇతను నా దగ్గర గత 16 సంవత్సరాలుగా వుంటున్నాడన్నారు.
లండన్‌లో ఆయన వైద్యశాస్త్రంలో పట్టా పొందాడన్నారు.
ఆర్మీలో మేజర్ హోదాలో ఎందరికో సేవ చేసాడన్నారు.
తనకొచ్చే జీతంలో నాకు ప్రతినెలా ఎంతోకొంత పంపుతున్నాడని చెప్పారు.
రెండవ ప్రపంచ యుద్ధానంతరం అతను నా దగ్గరకు వచ్చి చేరాడని చెప్పారు.
అప్పట్నుండి నన్నంటిపెట్టుకునే వున్నాడన్నారు.
ఒక ఇంగ్లీషు వ్యక్తి, విదేశీయుడు మెహెరాబాద్‌లాంటి కుగ్రామంలో
ఇక్కడున్న పరిస్థితులకు అనుగుణంగా సర్దుకుని వుండటం ఎంతో కష్టమైంది.
అయినప్పటికీ డాంకిన్ నాతోనే వుంటున్నాడన్నారు.
నా మండలి సభ్యుల గురించి ఈ మాదిరిగా పరిచయం చేయడం అవసరమా? అని
బాబా మరోమారు తన మొహంలో విసుగు కనిపించారు.
మీరందరూ నా మండలివారు కాదా? అని అడిగారు.
ఇందులో కొత్తేముందన్నారు.
మీరందరూ ఎంతో దూరం నుండి ఎన్నో వ్యయ ప్రయాసలకోర్చి
నా దగ్గరకు రాలేదా? అన్నారు.
మీరు మాత్రం నా ప్రేమికులు కాదా?
నా కార్యకర్తలు కాదా? అని ప్రశ్నించారు.
మిమ్మల్ని కూడా ప్రతిఒక్కర్నీ పేరు పేరునా పరిచయం చేయాల్సిన అవసరం వుందన్నారు.
నా కాళ్ళకున్న ఈ చెప్పులు గత నాలుగేళ్ళుగా నాకెంతో సహాయం చేస్తున్నాయి.

రాత్రిం బగళ్ళు నన్నంటిపెట్టుకుని ఉన్నాయి.
ఈ చెప్పుల యొక్క ఘనత గురించి ప్రత్యేకంగా చెప్పాలా? అని ప్రశ్నించారు.
అలా అంటూనే తిరిగి మండలి సభ్యుడైన కాకాబారియాను పరిచయం చేశారు.
కాకాబారియా మీ అందరికీ తెలుసు.
అతని అడ్రస్సు కూడా మీకిచ్చాడు.
ఎవరైనా మెహెరాబాదుకు విరాళాలు పంపదల్చుకునేవారు
ఆతని అడ్రస్సుకు పంపమని నేనే చెప్పాను.
**పాద్రీ:** చిన్ననాటి నుండీ ఇతను నాతోనే వుంటున్నాడు.
పాద్రీ అన్నింటా ముందేవుంటాడు.
అతని గురించి ఏమని చెప్పాలి?
తల నుండి పాదాల వరకు అతను బాబాకు విధేయుడుగా వున్నాడన్నారు.
పెండూ, విష్ణు, జాల్‌భాయ్ వీరందరి గురించి మీకు తెలుసు.
**శత్రుఘ్నుకుమార్:** ఈతను డెహ్రాడూన్ నివాసి అన్నారు. రాజకీయ కారణాలుగా జైలుకు వెళ్ళిన వ్యక్తి అని చెప్పారు. ఇతనికి ఒక ప్రత్యేక విధానముందన్నారు.
అతనికి అడ్డొచ్చినవారిని నడిరోడ్డు మీదనే కొట్టేస్తాడన్నారు.
మెహెరాబాద్‌లో ఆ మాదిరిగా చేయడులే అని బాబా చమత్కరించారు.
అతడు నాస్తికుడు కాకపోయినా భగవంతుడున్నాడంటే సుతరామూ నమ్మేవాడు కాదన్నారు.
పేదవాళ్ళు, గొప్పవాళ్ళనే బేధం అతనికి లేదన్నారు.
ఎవరికీ తలవంచని వ్యక్తిత్వం ఆయనిది.
అదేమోగానీ నాకు మాత్రం సంపూర్ణ విధేయుడుగా వున్నాడన్నారు.
తన తల నరికి నా పాదాల దగ్గర వుంచడానికి,
అలాగే తన భార్యని ముక్కలు ముక్కలుగా నరకమని నేను ఆదేశిస్తే
క్షణకాలం ఆలోచించడు,
శత్రుఘ్నుడు అని బాబా అతగాడి గురించి గొప్పగా పరిచయం చేశారు.
శత్రుఘ్నుకుమార్‌ని దగ్గరగా పిలిచి, బాబా కోసం నీ ప్రాణాలిస్తావా?
అని అడగ్గానే, తప్పకుండా బాబా అని గట్టిగా సమాధానమిచ్చాడు శత్రుఘ్నుడు.
ఆ తర్వాత ఆదీ సీనియర్ గురించి చెప్తూ, అతని గురించి మీకు తెలియదేముందన్నారు.
నా దగ్గర గత 30 సంవత్సరాలగా వుంటున్నాడన్నారు.
ఢాకేఫాల్కర్ గురించి చెప్తూ అతను 1924 నుండి నాతో వుంటున్నాడన్నారు.
అతనికి బాబా గురించి బాగా తెలుసని,
బాబా అంటే ఎవరో బాగా తెలుసన్నారు.
గుండె లోతుల్లో నుంచి బాబా అంటే ఈ యుగావతారుడని గట్టిగా చెప్తాడన్నారు.

అతను నన్ను అమితంగా ప్రేమిస్తాడని చెప్పారు.
సేవక్ కొత్వాల్ గురించి చెప్తూ,
1940 నుండి అతను, అతని భార్యా నాకంకితమై వున్నారన్నారు.
వారి ప్రేమ దేనితోనూ పోల్చలేమన్నారు.
గత కొన్ని సంవత్సరాలుగా నన్నెంతగానో ప్రేమిస్తున్నారని,
అలాంటివారు అరుదుగా వుంటారన్నారు.
మెహెర్‌జీ కర్కారియా మరో ఆణిముత్యం అన్నారు.
తన చిన్ననాటి నుండి అతను నా దగ్గర వుంటున్నాడన్నారు.
అతను నన్ను ప్రేమించే రీతిని మాటల్లో వర్ణించలేమని అన్నారు.
సిద్దూని పరిచయం చేస్తూ,
బాబా రెండు చేతులూ జోడించారు.
ఆతనికి చదువు రాదనుకుంటారందరూ,
కానీ, ఆతనికి అక్షర జ్ఞానం లేకపోయినా
అతను నాకు చేసే సేవ నిరుపమానమైనదన్నారు.
అతని సేవా కార్యక్రమం గురించి వివరించాలంటే కొన్ని సంవత్సరాలు పడుతుందన్నారు.
ఛగన్ గురించి చెప్తూ, అతని గురించి మీ అందరికీ తెలుసు కదా అన్నారు.
అలోబా నా దగ్గర తన చిన్నతనం నుండి వుంటున్నాడన్నారు.
అతని హృదయం, మనస్సు ప్రతిదీ అవతారునికే అంకితమన్నారు.
భావూ గురించి చెప్తూ, అతను యం.ఏ. దాకా చదివాడన్నారు.
కలలో కూడా నా నామస్మరణ బిగ్గరగా చేస్తాడని కొనియాడారు.
ఈ పరిచయ కార్యక్రమం,
ఈ ప్రశ్న ఎవరు లేవనెత్తారని మరోమారు ప్రశ్నిస్తూ,
మండలి సభ్యులుగా వీళ్ళే కాకుండా మరెందరో ఆణిముత్యాలు
నాకు చాలా దూరం ప్రాంతాల్లో కూడా వున్నారన్నారు.
వారిలో ముఖ్యంగా సరోష్ గురించి చెప్తూ,
అతగాడి గురించి ఏమనిచెప్పాలన్నారు.
తెలుగు బాబా ప్రేమికులు ఈ పరిచయ వాక్యాల గురించి లేవనెత్తినందుకు
తమని క్షమించమని బాబాని వేడుకున్నారు.
ఈ విషయం లేవనెత్తి బాబాని విసిగించినందుకు మేము తప్పు చేశామని,
లెంపలేసుకుంటున్నామన్నారు.
దీనికి సమాధానం చెప్తూ నేను మిమ్మల్ని ప్రతిక్షణం క్షమిస్తూనే వున్నానన్నారు.
వీరే కాకుండా అమెరికాలో ఎందరో నా ప్రేమికులు తమ సర్వస్వం నాకు

అర్పించినవారున్నారన్నారు. మీలో కూడా ఎందరో గొప్ప ప్రేమికులున్నారన్నారు.
ఆ మాటకొస్తే ధనపతిరావు నాయుడు, కుటుంబ శాస్త్రి, రంగారావులు
నా నామాన్ని గ్రామ గ్రామానా ప్రతివారికీ అందజేయడానికి
ఎంతో కష్టపడుతున్నారన్నారు.
నా పనిని ఎవరైతే చేస్తారో వారందరూ
నా మండలి సభ్యులే అన్నారు. ఆ మాదిరిగా నా మండలి సభ్యుల పేర్లను
ఒక చిట్టాగా రూపొందించాలనుకుంటే అదొక పెద్ద గ్రంథం అవుతుందన్నారు.
రమ్జూ అబ్దుల్లా, కిషన్ సింగ్, నానాఖేర్, అలాగే, ఫెరమ్ వర్కింగ్ బాక్సింగ్‌వాలా
ఇలా ఎందరో వున్నారన్నారు. నన్నెవరైతే ప్రేమిస్తారో వారందరూ నాకు చెందినవాళ్ళే
అని గుర్తించండని బాబా హెచ్చరించారు.
ఈ యావత్ ప్రపంచం నాకు సంబంధించిందేనన్నారు.
ఇందులోని ప్రతి జీవరాశి నాకు సంబంధించిందేనన్నారు.
మీరందరూ నావాళ్ళేనన్నారు.
ఈ మాటని మీ హృదయాలపై రాసుకోవాలన్నారు.
అందరూ నా వాళ్ళే కాని నేనే మీవాడిని కాదు,
నన్ను ప్రేమించేవాళ్ళందరికీ నేను వారి వాడినే.
వాళ్ళు నా దగ్గర వున్నా లేదా వారు సుదూర ప్రాంతాల్లో వున్నా
వారందరూ నా వాళ్లేనన్నారు.
తెలుగు సహవాస్‌కి ఆ రోజు ఆఖరి రోజు.
బాబా ఆ రోజున మెహెరాజాద్‌కి తిరిగి వెళ్తూ,
తన సహవాసీలందరితో ఇలా అన్నారు. మీరందరూ ఆనందంగా వుండండి.
నేను పింపల్‌గామ్ వెళ్తున్నాను. మీరందరూ మీమీ ప్రదేశాలకు వెళ్తున్నారు.
దేనికీ చింతించకండి. ఆలోచించకండి.
ఆనందంగా వుండండి. బాబాకి అన్నీ తెలుసని గమనించండి అని అన్నారు.
బాబా మెహెరాజాద్‌కు సాయంత్రం 4.30 బయల్దేరి వెళ్ళారు.
ఆ మర్నాడు ఉదయం భారమైన హృదయాలతో
బాబా ప్రేమికులందరూ వారివారి గమ్యాలకు బయల్దేరారు.

**ఇంతటితో ఈ శీర్షిక సమాప్తం.**

**వచ్చే నెల సంచికలో హిందీ సహవాస్ శీర్షిక ప్రారంభించనున్నాం...**

***

# జన్మ జన్మల ఋణాలు

కవనం: జెజ్జంకి వేంకట సుబ్బారావు, గుంటూరు.

ప॥ జత పడియున్నవి అనాదిగా - జన్మ జన్మల ఋణాలుగా
అ.ప॥ ఎన్నో యుగముల నుండి నీలోన
పేరుకొనియున్న సంస్కారములు ॥జతపడి॥

1. సింధువు నుండి వేరుపడిన - ఆ బిందు ఆత్మ నీలోన చేరుటకు
లక్షలాదిగా జన్మలెత్తవలె - వాయురూపమున శిలలరూపమున
ఖనిజ రూపమున వృక్షరూపమున - జల చరములుగా ఉభయచరములుగ
భూచరములుగా చిట్ట చివరకు - వానరముగాను తదుపరి నరునిగ ॥జతపడి॥

2. ఇంతవరకాత్మ ప్రయాణించినది - పరిణామక్రమమని యనబడును
ఆ జీవాత్మకు సంక్రమించినవి - సహజ సంస్కారములనబడును
ఆహారము భయ నిద్ర మైధునము - సంతానోత్పత్తియె ప్రముఖముగ
జీవించును జీవాత్మ జీవులలో - అంతటితో సంతృప్తిపడుచుండు ॥జతపడి॥

3. వానరము మానవుడుగ మార - విచక్షణా జ్ఞానమును పొందును
మంచి కర్మలను చెడు కర్మలను - రెంటిని జేయుచు జీవితములోన
సహజ సంస్కారములతో పాటు - అసహజ సంస్కారములార్జించును
సృష్టిలొ మానవుడేవుత్కృష్టము - అంత:పరిణామమున సాగుటకు ॥జతపడి॥

4. జీవాత్మ పరమాత్మలో చేర - ఆర్జించిన సంస్కారములన్నిటి
ఖర్చు చేయుటకు పుట్టుచు గిట్టుచు - ఎనభైనాలుగు లక్షల జన్మలు
ఎత్తవలయు ఈ విశ్వమందునా... - ప్రయాణమును త్వరత్వరగా ముగింప
యుగావతారుని కొంగు పట్టుటయే-నీకు శరణ్యము ఈ కలియందున ॥జత॥

5. సర్వజీవులందధివసించిన - ఆ పరమాత్మని ప్రేమించుచును
తోటి మానవుల సుఖదు:ఖములలో - పాలు పంచుకొని జీవించుచును
సర్వమానవ సౌభ్రాతృత్వము - సాధించుటయే నీ పరమావధి
నిన్ను ముక్తిధామమున జేర్చెడి - భారము వహించు మెహెరు ప్రభువు ॥జత॥



# అవతార్ మెహెర్‌బాబా జీవితచరిత్ర

**ఆంగ్ల మూలం: - భావూ కల్చూరీ, లార్డ్ మెహెర్, వాల్యూం-3 (1925-29) - తెలుగుసేత: మల్లాది రామారావ్, న్యూఢిల్లీ**

*(గత సంచిక తరువాయి)*

1927 నుంచీ బాబావారు వ్రాయటం లేదు.
సంతకం కూడా పెట్టడం లేదు. మరి పర్షియా వెళ్ళాలంటే పాస్‌పోర్టు కావాలి.
వీసా కావాలి. పాస్‌పోర్టు భారత ప్రభుత్వం ఇస్తుంది.
వీసాను పర్షియా ప్రభుత్వం జారీ చేస్తుంది.
ఈ రెండింటి కోసం విడివిడిగా దరఖాస్తులు పెట్టాలి.
అదీ బాబావారే స్వయంగా చేయాలి దరఖాస్తు.
కానీ బాబావారేమో నేను సంతకం పెట్టను అని నిర్మొహమాటంగా చెప్పారు.
ప్రయాణం రోజు దగ్గరపడుతోంది.
రెండు వారాల్లో బయలుదేరాలి.
పాస్‌పోర్టు, వీసా అంత త్వరగా వచ్చేవి కాదు.
అటువంటిది బాబావారి సంతకం కూడా లేకపోతే అవి వచ్చేనా?
ఇదొక ధర్మసందేహం.
అలనాటి బ్రిటీషు దొర గారు ఖరాఖండీగా చెప్పారు,
మీ బాబావారు సంతకం చేయపోతే,
దరఖాస్తు చెల్లదు.
వీసా ఇచ్చేది లేదని?
అయినా సరే మనవంతు ప్రయత్నం చేద్దామని పుదుమ్‌జీ, పాద్రీ, ఛాన్జీ
పెద్దపెద్ద అధికారులని కలిసారు.
తమగోడు విన్నవించారు.
పుదుమ్ గారికి బొంబాయిలో మంచి పలుకబడి వుంది.
పెద్దలు చాలామంది తెలుసు.
ఎంత మందని తెలిస్తేనేం,
ఎంత పేరుంటేనేం,
అధికారులు ఎవరూ కొరుకొాదు పడలేదు.

పాస్‌పోర్టు ఇవ్వలేదు.
అయితే, బాబా వెంట పర్షియా వెడుతున్న మండలివారికి మాత్రం పాస్‌పోర్టులు దొరికాయి.
అధికారులు వాళ్ళనీ ఓ పట్టు పట్టారు.
పాస్‌పోర్టు అప్లికేషన్‌లో ప్రతివారు తమ వృత్తి వ్రాయాలి.
ఆస్తిపాస్తుల వివరాలు అటువుంచి, ఆదాయం పేర్కొనాలి.
ఇది అలనాడు, ఇలనాడూ వున్న నిబంధన.
మన మండలివారు ఏ పనీపాటా చేయటం లేదు.
బాబావారినే నమ్మి, ఆయన వెంట తిరుగుతున్నారు.
మరి ఇప్పుడు మీ వృత్తి ఏమిటి? అని అడిగితే ఏం చేస్తారు.
అలా అని అసలు సంగతి చెప్తే పాస్‌పోర్టు ఆఫీసరు గారు,
ఫో పొమ్మంటాడు.
పనీపాటా లేనివాళ్ళు విదేశాలకి వెళ్ళి ఏం చేస్తారు,
చెడ్డపేరు తెస్తారు అందరికీ అని కసురు కొంటాడు.
ఏమి చేయాలో పాలుపోలేదు.
తలపట్టుకొన్నారు.
బాబావారికీ సంగతి చెప్పలేదు.
కానీ, సర్వాంతర్యామికి తెలియనివి ఏమీ వుండవు కదా.
ప్రభువు తనకేమీ పట్టనట్లు ఊరుకొన్నారు.
అప్పుడు తట్టింది ఓ ఐడియా,
"బాబావారిని సేవిస్తున్నాం" కదా,
ఆ మాటే వ్రాస్తే పోలేదు అన్నారొకరు.
భేషుగ్గా వుంది అన్నారు ఇంకొకరు.
అంతే ఆలస్యం దేనికి.
కలం పట్టారు అందరూ.
పాస్‌పోర్టు ఫారం పూర్తి చేశారు.
ఇంతకీ వృత్తి ఏం వ్రాశారనుకున్నారు?
ఊహించండి పాఠకమహాశయా.
"ఎమ్.ఎస్.ఇరానీ సేవ"
మా వృత్తి అని వ్రాశారు.
బాబావారి పేరు మేర్వాన్ షెరియార్జీ ఇరానీ
కదా అందుకని ముచ్చటగా
ఎమ్.ఎస్. ఇరానీ అని వ్రాశారు.

**గమనిక**

**అవతారుని జన్మ చరిత్రని మౌనవాణి పబ్లికేషన్స్ వారు పునర్ముద్రించిన దరిమిలా అనేక కొత్త సంగతులు వెలుగులోనికి వస్తున్నాయి. ఐతే, అవి లార్డ్ మెహెర్ వెబ్‌సైట్‌లో మాత్రమే లభ్యం ప్రస్తుతానికి.**
**ఆ ఆణిముత్యాలని ఈ సంచిక నుంచి పాఠకులకు అందిస్తున్నాం..**
**– అనువాదకుడు.**

బాబావారిని నిత్యం సేవిస్తున్నారు కాబట్టి బాబావారి సేవకులు వాళ్ళందరూ.
ఇదీ నిజమే. ఏదో కొంత లౌక్యం లేకపోలేదు కానీ,
అబద్ధం మాత్రం కాదు.
ప్రాణావసరం వచ్చినప్పుడు అబద్ధం ఆడవచ్చని శుక్రాచార్యులు ఎప్పుడో చెప్పారు.
మండలివారికి ప్రాణావసరం రాలేదు ఇప్పుడు అనుకోండి.
అయినా వాళ్ళేమయినా అబద్ధాలు చెప్తున్నారా ఏమన్నానా, వాళ్ళని తప్పుపట్టడానికి.
ఇలాగే, అబద్ధం కాని మరో నిజం చెప్పటం ద్వారా
బాబావారికీ పాస్‌పోర్టు దొరికింది.
అది ఎలాగ అంటే,...
మండలి వీసా కోసమని బువాసాహెబ్ పర్షియా దౌత్య కార్యాలయానికి వెళ్ళాడు.
అక్కడ అధికారితో మాట్లాడుతుంటే బాబావారి ప్రస్తావన వచ్చింది.
మెహెర్ ప్రభువు పర్షియా వెళ్ళాలనుకొంటున్నారు.
కానీ బ్రిటీష్ అధికారులు పాస్‌పోర్టు ఇవ్వటం లేదు అని చెప్పాడు.
అప్లికేషన్‌పై బాబావారు సంతకం చేస్తే తప్ప పాస్‌పోర్టు ఇవ్వమంటున్నారు.
మరి బాబావారేమో వ్రాయడం మానేసి చాలా రోజులయింది.
వేలిముద్రవేస్తామంటే వాళ్ళు ఒప్పుకోవటం లేదు.
భలే చిక్కు వచ్చింది.
టైమ్ లేదు.
బయలుదేరాల్సిన రోజు దగ్గరపడుతోంది.
ఏం చేయాలో పాలుపోవటంలేదు అని తను వాపోయాడు.
పర్షియా దౌత్య వేత్త ఓ సలహా ఇచ్చాడు.
ఆ సలహా నచ్చింది బువాసాహెబ్‌కి.
భేషుగ్గా వుంది మీ సలహా!
మా బాబావారికీ నచ్చుతుంది అన్నాడు.
అంతే ఆ అధికారి చెప్పినట్లే చేశాడు.
పాస్‌పోర్టు కష్టం కట్టెక్కింది.
ఇంతకీ ఏంజరిగింది అంటే,
మీ బాబావారికి మేము పాస్‌పోర్టు ఇస్తాం అన్నాడు పర్షియా దౌత్యవేత్త.
బాబావారి తల్లిదండ్రులు పర్షియన్లు కదా,
మాదేశంలో పుట్టారు కదా వాళ్ళు.
అంటే బాబావారు కూడా పర్షియను దేశస్థుడు అవుతారు.
ఈ మాటనే చెప్పమనండి మీ బాబాగారిని పాస్‌పోర్టు ఇచ్చే పూచీ నాది అన్నాడు.

వెంటనే, హుటాహుటీన బాబావారి దగ్గరకి వచ్చాడు బువాసాహెబ్.
దౌత్యవేత్త చెప్పిన మాటని బాబావారి చెవిన వేశాడు.
బాబావారు సరేనన్నారు.
పాస్‌పోర్టు అప్లికేషన్‌పై వేలిముద్ర వేశారు.
దాన్ని బువాసాహెబ్ అధికారికి ఇచ్చాడు.
ఆయన పాస్‌పోర్టు మంజూరు చేశాడు.
అలా సెప్టెంబరు 12వ తేదీ గురువారంనాడు బాబావారికి పర్షియా పాస్‌పోర్టు దొరికింది.
దీనితో వారి పర్షియా యాత్రకి మార్గం సుగమమయింది.
మరి తిరిగి వస్తున్నప్పుడు, బొంబాయిలో అడుగుపెట్టాలంటే బాబావారిని రానివ్వరట.
మీరు పాస్‌పోర్టు ప్రకారం, విదేశీయులు క్రిందే లెఖ్క.
మీది పర్షియా పాస్‌పోర్టు కదా!
కాబట్టి భారతదేశపు వీసా కావాలి మీకు.
అది వుంటేనే మిమ్మల్ని బొంబాయికి రానిస్తారని చెప్పారు.
ఇదొక కొత్త సమస్య.
ఎవరికీ ఏమీ పాలుపోలేదు.
యుగావతారుడికి కూడా పాస్‌పోర్టు, వీసా సమస్యలు తప్పలేదా!
ఔరా! ఏమి విధి వైపరీత్యం! అని ముక్కున వేలు వేసుకొంటున్నారా! పాఠకమహాశయా!
మీరు అలా అనుకోవటంలో తప్పు లేదు.
సామాన్యుల్లో అతి సామాన్యుడిగా వుండటం,
అందరి కష్టాలనీ తనపైనే వేసుకోవడం,
నేనున్నాగా మీకెందుకు చింత అంటూ అభయం పలకడం పరాత్పరుడికి ఓ అలవాటు,
అదొక సరదా!
మనికి అర్థం కాక బుర్ర బ్రద్దలు కొట్టుకొంటూ వుంటే,
చిరునవ్వులు చిందిస్తూ, సంతోషంగా వుండండి అనటం పరబ్రహ్మకే చెల్లుతుంది.
సరే ఇంతకీ బాబావారి కొత్త వీసా సమస్య పరిష్కారమయిందా?
బాబావారేమన్నారు బ్రిటీషు దొరలు ఓ మెట్టు దిగి వచ్చారా లేదా!
ఈ కథాకమామీషు తెలుసుకోవాలనుకొంటే, పాఠకమహాశయా,
కాస్తంత ఓపిక పట్టాలి మీరు.
మనం చెప్పుకొంటున్నది బాబావారి కథ.
ఏ రోజున ఏం చేసారన్న సంగతి తెలుసుకొంటున్నాం.
ఇప్పుడు 11వ తేదీ దగ్గర వున్నాం.
కాస్తంత ఓపిక పడితే మీకే తెలుస్తుంది ఏమయిందీ.

మా ఓపికకి పరీక్ష పెడ్తున్నారా అని ప్రశ్నించకండి.
ఇది బాబావారి ఇచ్ఛ అని గ్రహించండి.
ఎందుకంటే తమ జీవిత కథని రోజువారిగా వ్రాయమని ఆదేశించారు.
అందువల్లనే బాబావారు ఏ రోజున ఏం చేశారో మనకి తెలుస్తోందీ వేళ.
గత అవతార కాలాలకీ ఇప్పటికీ ఇదే తేడా.
అప్పటి కథ పూర్తిగా తెలీదు ఎవ్వరికీ.
ఇప్పుడో మరి అలా కాదు.
సరే మన కథలోకి వస్తే
బ్రిటీషువారు పాస్‌పోర్టు ఇవ్వమని భీష్మించుకొన్న రోజు రాత్రి
బాబావారు కారులో షికారుకి వెళ్ళారు.
మర్నాడు సాయంత్రం నాలుగున్నరకి క్రికెట్ మ్యాచ్ చూశారు.
11వ తేదీన మెహెరాబాద్ నుంచి కె.జె. దస్తూర్ మహాశయుడు వచ్చాడు.
ప్రభుదర్శనం చేసుకొన్నాడు. మెహెరాబాద్ కబుర్లు చెప్పాడు.
మర్నాడు రాత్రి అంటే 12వ తేదీ రాత్రి వాపసు వెళ్ళాడు మెహెరాబాద్‌కి.
ఈ వేళ అంటే 12వ తేదీన పర్షియా పాస్‌పోర్టు వచ్చింది బాబావారికి.
14వ తేదీన మున్షిజీ, సయ్యద్, సాహెబ్, ఉస్మాన్ సాహెబ్‌లు వచ్చారు.
బాబావారు కాండివిలీలో మార్కర్‌గారి ఇంట వుంటున్న సంగతి వాళ్ళకి తెలుసు.
అందుకని వాళ్ళు ఎకాయెకి కాండివిలీ వచ్చారు.
ప్రభు దర్శనం చేసుకొన్నారు.
ఆ రాత్రి బాబావారి దగ్గరే వున్నారు.
తెల్లవారుతూనే అంటే 15వ తేదీ ఉదయం బాబావారు మార్కర్ బంగళాలో వ్యాహ్యాళికి బయలుదేరారు. బంగళా చుట్టూరా పచ్చని గడి, తివాసీలా పెరిగింది.
అందమయిన పూలచెట్లు, ఆహ్లాదకరమైన వాతావరణం అది.
బాబావారు తోటలో అటూ ఇటూ తిరుగుతూ రెండుమూడు సార్లు గడ్డిమీద చతికిలపడ్డారు.
అలా అని ఎక్కువ సేపు కూర్చోలేదనుకోండి.
కాస్సేపు కూర్చున్నట్లే కూర్చొని మళ్ళా వడివడిగా నడిచారు.
దిన్షా మార్కర్, పిల్మాయి బాబావారిని కలిశారు. జంటగా కాదు.
విడివిడిగానే. తమ ధర్మ సందేహాలని తీర్చుకొన్నారు.
వాళ్ళిద్దరితో మాట్లాడాక బాబావారు మేడ ఎక్కి బాల్కానీలో కూర్చున్నారు.
పదిన్నర వరకూ అక్కడే వున్నారు.
మున్షీజీ, సయ్యద్ సాహెబ్, గుస్తాద్‌జీ, రమ్జూ, బువాసాహెబ్, ఛాన్జీ గారు బాబావారి సన్నిధిలో కూర్చొన్నారు. మౌనంగానే సాగింది మాటామంతీ.

విష్ణు వచ్చాడు. ఛోటా బాబానీ, జాల్ భాయినీ తీసుకొని బొంబాయి చూసివస్తానన్నాడు.
సరేనన్నారు బాబా. ఎక్కడ డబ్బు ఖర్చు పెట్టకండి అని హెచ్చరించారు.
విష్ణు అలాగేనని బుర్ర వూపుతూ మెట్లు దిగాడు.
ఈవేళ, ఎప్పటిలా చాలామంది వచ్చారు.
ప్రభుని దర్శించి, తరించడానికి.
ఆ వచ్చినవారందరూ ప్రేమతో వచ్చారా?
ఏదో వరసిద్ధి పొందాలని వచ్చారా!
ఇవి చొప్పదంటు ప్రశ్నలు.
తమ దర్శనానికి వచ్చే వందలాదిమందిలో నిజమైన భక్తులు ఒక్కరో ఇద్దరో వుంటారని
ఆ ఒకరిద్దరి కోసమే తమ దర్శన కార్యక్రమమనీ బాబావారు ఏనాడో శెలవిచ్చారు.
మర్చిపోకూడదీ సంగతిని మనం ఎప్పుడూ.
ఒంటరిగా వస్తాను నేను.
ఒంటరిగానే వెళ్ళిపోతాను అన్నారు బాబావారు.
అందరికీ అంతటికీ అన్నింటికీ చెందినవాడనే కానీ, ఒంటరిగా వస్తూ,
ఒంటరిగానే వెళ్ళిపోతుంటానని బాబావారు ఆంథోనీకి చెప్పారావాళ.
ఈ ఆంథోనీ ఎవరు? ఆయనకో భగవత్ప్రేమికుడు.
బాబావారి దర్శనం కోసం వచ్చాడావాళ.
మధ్యాహ్నం భోజన సమయంలో బాబావారే అందరికీ వడ్డించారు.
భోజనాలు అయ్యాక, పుదుమ్‌జీ ఇంటికి వెళ్ళారు.
అక్కడ క్రికెట్ మ్యాచ్ చూశారు.
నాలుగున్నరకి మార్కర్ ఇంటికి తిరిగి వచ్చారు.
అప్పటికే ఇల్లు కిటకిటలాడుతోంది.
బాబావారి దర్శనం కోసం వచ్చినవారే అందరూ.
వాళ్ళ మనోభీష్టాన్ని నెరవేర్చాక, బాబావారు కాసేపు తోటలో పచార్లు చేశారు.
తమ గదికి తిరిగి వచ్చాక తమకిష్టమయిన పాటలు విన్నారు.
పదిన్నర వరకు గ్రామఫోను రికార్డులు వేస్తూనే వున్నారు.
ఈవాళ్టి మరో విశేషం – రుస్తుమ్ రాక.
నాసిక్ నుంచి ఊడిపడ్డాడు అతగాడు.
16వ తేదీ ఉదయం బాబావారు మండపేశ్వర్ గుహలకి వెళ్ళారు.
పోయినీసుర్ కొండ అని కూడా పిలుస్తారీ ప్రాంతాన్ని.
పోర్చుగీసుల కాలంలో కట్టిన చర్చి,
ఓ పాతకాలపు క్రైస్తవ మఠం,

అనాథశరణాలయం అక్కడి ఆకర్షణలు.
చర్చి శిఖరాగ్రాన శిలువపై క్రీస్తు దర్శనమిచ్చారు.
ఆలనాపాలనా లేక చర్చి శిథిలావస్థలో వుంది.
అయితేనేం, అక్కడ నిలబడి నాలుగు దిక్కులా చేస్తే, ఆ లోయలు, కొండలు,
కనువిందు చేస్తాయి. చర్చి కొంచెం ఎత్తుగా వున్నచోట కట్టడం వల్ల,
అక్కడి నుంచి ఎటు చూసినా కనులపండుగగా వుంటుంది.
ఆవాళ్టి మధ్యాహ్న భోజనం – నౌరోజీ ఇంటిలో. ఎప్పటిలానే,
అందరికీ బాబావారే స్వయంగా వడ్డించారు.
ఇహ మళ్ళీ పాస్‌పోర్టు కథలోకివస్తే...
బాబావారికి పర్షియా పాస్‌పోర్టు దొరికింది.
ఇండియాకి తిరిగి రావటానికి వీసా మాత్రం ఇంకా దొరకలేదు.
బాబావారు సంతకం చేయకపోతే,
వీసా దరఖాస్తు చెల్లదని బల్లగుద్దినట్లు చెప్పాడు తెల్లదొర గారు.
“నన్నేం చేయమంటారు! నేనేం చేయలేను.
మీరు వెళితే వెళ్ళండి పర్షియాకి.
తిరిగి ఇక్కడ అడుగుపెట్టడం కష్టం మీ ఇష్టం” అన్నారు,
మొహమాటం లేకుండా!
16వ తేదీన బాబావారికీ మాట చెప్పాడు ఛాన్జీ.
“నన్నేమి చేయమంటావ్ బాబా” అని అడిగాడు ఎంత కష్టమయితే,
అంత మంచిది అన్నారు. నీ వంతు నీ ప్రయత్నం చేయమన్నారు.
వెంటనే నాసిక్‌కి బయలుదేరారు.
అక్కడ స్త్రీ మండలి వుంటున్న సంగతి పాఠకులకి తెలుసు కదా.
బాబావారి రాకతో ఎంత సంతోషించారు వారు.
రస్సెల్ స్టూడియోలో తీయించుకొన్న ఫోటోలని బాబావారు బహుకరించారు.
వాళ్ళ ఆనందానికి హద్దులు లేవు ఆవేళ.
మర్నాడు, 17వ తేదీన బాబావారు బొంబాయికి వాపసు వచ్చారు.
వీసా ఎంత వరకు వచ్చిందని అడిగారు”.
ప్రయత్నిస్తున్నాను బాబా”, అన్నాడు ఛాన్జీ.
18వ తేదీన రుస్తుంకి బాబావారు పవర్ ఆఫ్ అటార్నీ ఇచ్చారు.
ప్రభువు పర్షియా యాత్రలో వుండగా, ఇక్కడ నాసిక్‌లో కానీ,
మెహెరాబాద్‌లో కానీ ఏపని చేయాలన్నా స్వేచ్ఛగా,
ధైర్యంగా చేసే అధికారం రుస్తుంకి ఇచ్చారు.

ప్రభువు నమ్మకానికి పాత్రుడైన రుస్తుం ఎంత అదృష్టవంతుడో కదా!
19వ తేదీన ఛాన్జీ, బొంబాయి గవర్నరు గారిని కలిశాడు.
ఆ పెద్దాయనకి నచ్చచెపితే, వీసా దొరకుతుందని అతగాడి ఆశ.
"నీది పేరాశ, నిరాశ మిగుల్తుంది" అని హెచ్చరించారు అతని స్నేహితులు.
అయినా సరే ధైర్యంగా ముందుకి కదిలాడు.
ప్రయత్నం చేస్తే తప్పేముంది? అనుకొన్నాడు.
గవర్నరు గారి ఆఫీసుకి వెళ్ళాడు.
అక్కడ అతగాడు అడుగుపెట్టుంటే,
ఇక్కడ మార్కర్ ఇంట కూర్చొన్న బాబావారేమన్నారో తెలుసా ఊహించగలరా?
"ఈవేళ అన్ని పనులు పూర్తి కావాల్సిందే" అన్నారు.
బాబావారి మాట విన్న మండలివారికి కొత్త ఆశ పుట్టింది.
రెండు వారాలుగా నానుతున్న వీసా సమస్య
ఓ కొలిక్కి వస్తుందీవేళ అన్న నమ్మకం కల్గింది.
నమ్మకం, అపనమ్మకం ప్రక్క ప్రక్కనే వుంటాయట.
అందుకనే, ఛాన్జీ మాట గవన్నర్ గారు వింటారా అన్న ధర్మ సందేహం పట్టుకొంది
వాళ్ళకి. చాన్జీ రాక కోసం ఎదురుచూస్తూ కూర్చొన్నారు.
అక్కడ గవన్నరు గారితో భేటీ అరగంటసేపు జరిగింది.
ఛాన్జీ గోడుని గవర్నరు సావధానంగా విన్నారు.
"మీ బాబావారికి వీసా నేను ఇప్పిస్తానన్నాడు.
రాజు గారు తలుచుకొంటే సాధించలేనిది ఏముంటుంది కనుక.
బాబావారి వీసా నిమిషాలల్లో తయారైంది.
బాబావారి పర్షియా యాత్రకి ఏర్పాట్లు చకచకా జరిగినాయి.
"రేపే బయలుదేరుతుంది నౌక.
హాయిగా వెళ్ళిరమ్మనండి బాబావారిని" అన్నారు గవర్నరు గారు.
ఛాన్జీ గాలిలో తేలిపోయాడు.
హుటాహుటిన మార్కర్ బంగళాకి వచ్చాడు.
బాబావారికి శుభవార్త చెప్పాడు.
మండలి ఆనందాన్ని మాటల్లో చెప్పలేము.
వారు వెంటనే ప్రయాణం ఏర్పాట్లలో పడ్డారు.
బాబావారు హడావుడిగా వున్నప్పుడు ఊడిపడడం ఆఘూ ఆలీ తల్లిదండ్రులకు అలవాటు.
ఈవేళా అంతే జరిగింది.
ఓ ప్రక్క బాబావారి దర్శనం కోసం ఎందరో వచ్చారు,

బాబావారి దర్శనం మళ్ళీ ఎప్పటికో అనుకొంటూ.
ఇదేమీ పట్టని ఆఘూ ఆలీ తల్లిదండ్రులు,
ఏం చేస్తున్నావ్ మా బిడ్డడిని అంటూ రాద్ధాంతానికి దిగారు.
మీ బిడ్డ నా బిడ్డ. నాతోనే వుంటాడని వాళ్ళకి నచ్చచెప్పారు బాబా.
ఇప్పుడు ఇక్కడ లేడు ఆఘూ ఆలీ. వాడిప్పుడు క్వెట్టాలో వున్నాడు.
రావ్‌సాహెబ్ సంరక్షణలో వున్నాడు.
వాడొక్కడే కాదు, ఆలీ అక్బరు, ఛోటా బాబా కూడా క్వెట్టాలో వున్నారు ఇప్పుడు.
ఈ ముగ్గురి బాగోగుల్ని రావ్‌సాహెబ్ చూస్తున్నాడు.
వాళ్ళని పర్షియా తీసుకురమ్మని చెప్పాను వాళ్ళు క్వెట్టా నుంచి ఏకాయెకి పర్షియా
వెడతారు అని బాబావారు చాలా ఓపికగా ఆఘూ ఆలీ తల్లిదండ్రులకి వివరించారు.
గాభరాపడకండి అన్నారు.
హమ్మయ్య! మా బిడ్డ సుఖంగా వున్నాడు కదా అని వాళ్ళు ఊపిరి తీసుకొన్నారు.
ఇంటి ముఖం పట్టారు.
20వ తేదీ ఉదయం 11 గంటలకి బయలుదేరుతుంది పర్షియాకి నౌక.
దాని పేరు వెర్సోగా. షిరిన్‌మాయి, గుల్మాయి కూడా వస్తున్నారట వీడ్కోలు చెప్పడానికి.
ఇండియాలో పుట్టిన ఈ యుగాంతపు అవతారుడు,
తొలి అవతారుడు జొరాస్టురు వెలసిన పర్షియా దేశానికి వెడుతున్నాడు.
మానవ ఇతిహాసంలో సువర్ణాక్షరాలతో లిఖించ దగిన సంఘటన ఇది.
ఇందుకనేనేమో, మరి బాబావారు ఆరుగురు ప్రియ శిష్యులకి
కొత్త ఉపవాస దీక్ష ఇచ్చారు.
మెహెరాబాద్‌కి వెళ్ళి ఒక గదిలోనే వుండండి అని చెప్పారు వాళ్ళకి.
కొంచెం పాలు మాత్రం త్రాగండి.
ఇంకేమీ ఘన ద్రవ పదార్ధాలు తీసుకోకండి అన్నారు.
చిత్తం బాబా అన్నారు. ఆ ఆరుగురు.
ఇంతకీ ఆ ఆరుగురూ ఎవరు అంటే
రుస్తుం, పాద్రీ, నావల్, కైకాబారియా, దస్తూర్, ప్లీడరు.
ఏమనుకొన్నారో ఏమో మీరందరూ వద్దు,
ఒక్క ప్లీడరు వుంటే చాలు ఏకాంతంగా అన్నారు బాబా.
మిగిలినవాళ్ళు ఒక్కరోజు ఉపవాసం చేశారు.
మరీ కటిక ఉపవాసం కాదు.
మధ్యలో కాసిని పాలు త్రాగారు.
ఇది ప్రభువాజ్ఞ!.

క్రొత్త పుస్తకం

# బాబా సందేశాలు




అవతార్ మెహెర్‌బాబా ఇచ్చిన అనేక సందేశాల సమాహారం ఈ క్రొత్త పుస్తకం. మొత్తం 470 పేజీలలో బాబా అనేక సందర్భాలలో ఇచ్చిన సందేశాలలో ముఖ్యమైన 2400 సందేశాలను క్రోడీకరించి గ్రంధస్తం చేశారు. ఈ పుస్తకం ఇంగ్లీషులో వుంది. ఈ పనిని హైదరాబాద్‌లోని కోఠి బాబా సెంటర్ తరపున శ్రీ నోరి సూర్యనారాయణ ప్రభృతులు చేపట్టి ఇటీవల బాబావారి జన్మదినమైన ఫిబ్రవరి 25, జూబ్లి బాబా కేంద్రంలో ఆవిష్కరించారు. ఈ పుస్తకంలోని ముందు పేజీలలో బాబావారి సంక్షిప్త జీవిత చరిత్రను, చివరి పేజీలలో బాబావారి ప్రార్ధనలను ప్రచురించారు.

బాబావారి సందేశాలన్నింటినీ పాఠకుల సౌలభ్యం కోసం అంశాలవారీగా, ఆంగ్ల అక్షరమాల క్రమంలో అందంగా ప్రచురించారు. ఐతే ఈ పుస్తకంలోని అంశాలన్నీ ఇంగ్లీషు భాషలో వున్నాయి. రాబోయే రోజుల్లో ఈ గ్రంధాన్ని తెలుగులో అనువదించి తెలుగు పాఠకులందరికీ అందుబాటులో వుంచాల్సిన అవసరం ఎంతైనా వుంది. బాబావారిచ్చిన ఈ సందేశాలన్నీ నిత్యనూతనాలు. ఈ పుస్తకంలోని ప్రతి అంశం, ప్రతి పేజీ ఆధ్యాత్మిక చింతనాపరులకు అత్యంత ప్రధానంగానే కనిపిస్తుంది. ప్రతి బాబా ప్రేమికుని ఇంట్లో ఈ పుస్తకం తప్పక ఉండవల్సినది. వెల రూ. 150/-. **ప్రతులకు:** అవతార్ మెహెర్‌బాబా సెంటర్, కోఠి, ఇంటి నంబరు 4-7-297/ఎ, ఈసామియా బజార్, ప్రభుత్వ మహిళా కళాశాల వెనుక, హైదరాబాద్ - 500 027 సంప్రదించగలరు.

# అవతార్ మెహెర్‌బాబా
# దివ్య చరిత్ర - చలన చిత్రం




"మెహెరాబాద్‌లో వెలిసిన మెహెర్‌బాబా చరిత్రయేనంటూ" గీతరూపంలో సాగే **అవతార్ మెహెర్‌బాబా దివ్య చరిత్రను చలనచిత్ర రూపంలో** శ్రీ లక్ష్మీనరసింహారావు, కరీంనగర్ రూపొందించారు. సుమారు 40 నిముషాల నిడివి గల ఈ డివిడిని ఇటీవల అవతారుని అమరతిథి సందర్భంగా మెహెరాబాద్‌లో ఆవిష్కరించినట్లు ఆయన తెలిపారు. మెహెర్‌బాబా దివ్య జీవిత చరిత్రను బాబా జననం నుండి పంచసద్గురువుల సాంగత్యం, మస్తుల సాంగత్యం, నవజీవనం నుండి బాబా భౌతిక దేహ త్యాగం దాకా చక్కగా చిత్రీకరించారు. మెహెర్‌బాబాకు చెందిన అనే ఫిల్ముల్లోని క్లిప్పింగ్స్‌లను కూడా ఈ చిత్రంలో పొందుపరిచి, బాబా జీవిత చరిత్రను కళ్ళకుకట్టినట్లు వుండే చక్కని చలన చిత్రాన్ని శ్రీ లక్ష్మీనరసింహారావు, కరీంనగర్ రూపొందించారు. ప్రతి బాబా ప్రేమికుడు తప్పక చూడవల్సిన ఈ డి.వి.డి ఒక కమ్మని రమణీయ దివ్య గాన చిత్రం. బాబా ప్రేమికుల మనస్సుకు హత్తుకునేలా ఈ ఫిల్ము చిత్రీకరణ వుంది. ఈ చిత్రాన్ని తెలుగు, హిందీ భాషలలో రూపొందించారు. ఒక్కొక్క డి.వి.డి ఖరీదు రూ. 70/- గా నిర్ణయించారు.

బాబా ప్రేమికులు తమ బంధుమిత్రులందరికీ కానుకగా ఇవ్వదగ్గ బహు చక్కని డివిడిని నిర్మించిన శ్రీ లక్ష్మీనరసింహారావు అభినందనీయుడు.

ఈ డివిడిల కోసం శ్రీ లక్ష్మీనరసింహారావు, అవతార్ మెహెర్‌బాబా సెంటర్, సాయి నగర్, కరీంనగర్, సంప్రదించగలరు. ఫోన్,(94400 08303),

# అజయ్ ఇంట్లో ఏకాహం

హైదరాబాద్‌లోని హిమయత్‌నగర్‌లో శ్రీ అజయ్ బాబు గారింట్లో మార్చి 22న బాబావారి ఏకాహం ఘనంగా జరిగింది. మార్చి 22 ఉదయం 5 నుండి సుమారు గంటసేపు నగర సంకీర్తన, అనంతరం ఉ. 6 నుండి సా. 6 దాకా మెహెర్‌బాబా వారి ఏకాహం జరిగింది. బాబా ప్రేమికులు పలు దూర ప్రాంతాల నుండి విశేషంగా హాజరయ్యారు.

# మెహెర్‌గడ బాబా సెంటర్ 26వ వార్షికోత్సవం

కర్నాటక రాష్ట్రంలోని మెహెర్‌గడ (పావగడ) బాబా సెంటర్ 26వ వార్షికోత్సవం మార్చి 28, 29 తేదీలలో ఘనంగా జరిగింది. తాడేపల్లిగూడెం నుండి ప్రత్యేక అతిథిగా శ్రీమతి బాలగోపాల గోవిందమ్మ గారు, శ్రీమతి మెహెర్ శాంతి హాజరయ్యారు. శ్రీమతి గోవిందమ్మ గారు మెహెర్‌బాబా ఆంధ్రా పర్యటనలో భాగంగా తాడేపల్లిగూడెంలో మెహెర్‌బాబా వారింటిక రావడం, బాబా సమక్షంలో వారు గడిపిన మధుర క్షణాలు కొన్నింటిని ఎంతో మధురంగా వివరించారు. అవతారుని సందేశాలపై శ్రీ ఎవిజి హరిప్రసాద్ ప్రసంగించారు. కాగా, ఈ రెండు రోజుల వార్షిక సహవాస్ అత్యంత వేడుకగా ఘనంగా ముగిసాయి. హిందూపురం, బెంగళూరు, ధర్మవరం, అనంతపురం, నుండి బాబా ప్రేమికులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# మురమల్ల**వారి** వివాహం

శ్రీమతి మురమల్ల చంద్ర, శ్రీ మురమల్ల నారాయణ రావ్ గార్ల పుత్రుడు చి॥ మెహెర్ కృష్ణ వివాహం చి॥ల॥సౌ॥ కరుణశ్రీతో 01.05.2015 శుక్రవారం ఉ. 11.09 గం.లకు ఈడన్ ప్లాజా ఫంక్షన్ హాల్, కిషన్ నగర్ రోడ్, షాద్ నగర్, మహబూబనగర్ జిల్లాలో జరుపుతున్నట్లు ఆహ్వానం పంపినారు.

# గుంటూరు సెంటర్

గుంటూరు సెంటర్ మెహెర్ హౌస్ 51వ వార్షికోత్సవం 2015 మార్చి 1న ఉదయం 9 నుండి మధ్యాహ్నం వరకు ప్రత్యేక సత్సంగ్ నిర్వహించినట్లు శ్రీ కె. కనకయ్య ఒక ప్రకటనలో తెలిపారు. డా॥ ఇ.యస్. ప్రభాకర్ సప్తవర్ణ పతాకాన్ని ఆవిష్కరించారు. శ్రీ యు. బాపిరాజు, శ్రీ బి.డి. నరససింహారావు, శ్రీ రంగబాబు తదితరులు బాబా సందేశాలపై ప్రసంగించారు. చక్కని సాంస్కృతిక కార్యక్రమాలు, దగ్గర్లో వున్న అనాథపిల్లలకు భోజనాలు ఏర్పాటు చేశామని శ్రీ కనకయ్య అన్నారు.

# భగవద్వచనము సదస్సు




ఉగాది పండుగ రోజు, మార్చి 21, శనివారం.ఆ రోజు ఉదయం 9 నుండి సాయంత్రం 5 దాకా జూబ్లిహిల్స్ బాబా కేంద్రంలో మెహెరాబాద్ నుండి ప్రత్యేకంగా వచ్చిన డాక్టర్ వార్డ్ పార్క్స్, భగవద్వచనం గ్రంథంపై ఒక ప్రత్యేక సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమం తెలుగు అనువాదం లేకుండా పూర్తిగా ఇంగ్లీష్‌లోనే జరిగింది. ఇంగ్లీషు అంతోఇంతో అర్థమయ్యేవారే ఈ కార్యక్రమానికి హజరుకావాలని నిర్వాహకులు ముందుగానే హెచ్చరించారు.

జంటనగరాలవారే కాకుండా ఉభయ గోదావరి జిల్లాలు, హైదరాబాద్‌కు సమీప జిల్లాలవారు కూడా ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సెమినార్‌కు కేవలం నూరు మందికి మాత్రమే పరిమితం చేశారు. డా. వార్డ్ పార్క్స్ 1980 నుండి మెహెరాబాద్‌లోనే స్థిరనివాసముంటున్నాడు. గాడ్ స్పీక్స్ గ్రంధాన్ని ఆసాంతం ఎన్నిసార్లు చదివానో తనకే తెలియదన్నాడు. మెహెర్‌బాబా మానవాళికి స్వయంగా అందించిన అపురూప కానుక భగవద్వచనం అన్నారు. ఆధ్యాత్మిక సాహిత్యంలో ఈ గ్రంధానికి మరొకటి సాటిలేదన్నారు. కాగా, సెమినార్‌లో భగవద్వచనంలో అవతారుడు చెప్పిన ఆత్మ యొక్క చైతన్య పరిణామ క్రమం, సృష్టి ఆవిర్భావం, ఆత్మసాక్షాత్కారం, తదితర అంశాలను వివరణాత్మకంగా వివరించారు. **గాడ్ స్పీక్స్‌తోపాటు ఇన్ గాడ్స్ హేండ్, ఇన్‌ఫినేట్ ఇంటిలిజెన్స్, డివైన్ థీమ్, వంటి అరుదైన ఆధ్యాత్మిక గ్రంధాలను** కూడా తాను కూలంకషంగా ఒకటికి రెండుసార్లు అధ్యయనం చేసానన్నాడాయన. ఇదికాకుండా 1960 ప్రాంతంలో బాబా తన మండలి సభ్యుడైన ఫ్రాన్సిస్ బ్రాబజాన్‌కు భగవద్వచన గ్రంధానికి సంభందించిన అదనపు వివరణలను కొన్నింటిని ఇచ్చారు. ఆ వివరణల ఆధారంగా భగవద్వచన పునర్ముద్రణలో ఆ అంశాలను పొందుపరచమని బ్రాబజాన్‌ని బాబా ఆదేశించినట్లు సమాచారం. వార్డ్ పార్క్స్ ఆ అంశాలను కూడా ఆకళింపుచేసుకునే ప్రయత్నం చేశానన్నాడాయన. ప్రతి ఒక్కరూ భగవద్వచనం చదివే ప్రయత్నం చేయాలని, ఇది బాబా వారి ఆదేశమని, ఆయన గుర్తు చేశారు.



# విశాఖ బాబా సెంటర్

విశాఖ బాబా సెంటర్‌లో 5.4.2015న జరిగిన సర్వసభ్య సమావేశంలో సమావేశంలో 2015-2017 గాను కార్యనిర్వాహక సభ్యులను ఎన్నుకున్నట్లు ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీ కె.వి రత్నం, గౌ. అధ్యక్షులుగా (94404 03429), శ్రీ ఎల్.వి. రమణమూర్తి, శ్రీమతి కె. తులసి కుమారి, గౌ. ఉపాధ్యక్షులుగా, శ్రీ టి. అప్పల సూర్యనారాయణ, కార్యదర్శి, శ్రీ ఆర్.యమ్.రాజు, సంయుక్త కార్యదర్శిగా, శ్రీ కె. హేమసుందర్, కోశాధికారిగా ఎంపికయినట్లు కార్యదర్శి ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే, శ్రీ పి. సతీష్, శ్రీ టిడియస్ మూర్తి, శ్రీ ఎ.ఎల్. కాంతారావ్, శ్రీ వై. నీలాచలం, శ్రీ ఆర్. పైడిరాజు, శ్రీ కె. సత్యారావు, శ్రీమతి కె. శ్రీలక్ష్మి, శ్రీమతి యం. సుభద్ర ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా ఎంపికయ్యారని కార్యదర్శి ప్రకటించారు.

# మెహెర్ వర్ణాంజలి



శ్రీ కె.ఎ. నారాయణ భాగవతార్ స్వీయగానంతో మెహెర్ వర్ణాంజలి సి.డి.లను ఇటీవల విడుదల చేశారు. రెండు భాగాలలో, రెండు డి.వి.డి.లలో శ్రీ నారాయణ భాగవతార్ తనదైన శైలిలో భావ,రాగ,తాళ యుక్తంగా ఆలాపించిన భక్తిగీతాలను బాబా ప్రేమికులు ప్రతి ఒక్కరు తప్పక ఆలకించాలి. ఈ భజన గీతాలన్నింటినీ ఒక పుస్తకంగా ప్రచురించారు. సి.డి.లతో పాటు ఈ పాటల పుస్తకం కూడా శ్రీ నారాయణ అందజేస్తున్నారు. శ్రీ నారాయణ గారి మనుమరాళ్ళు వినీషా మెహెర్, నిమీషా మెహెర్, బింద్యశ్రీ మెహెర్‌లు ఈ సి.డి.లను బాబా ప్రేమికులందరికీ ప్రత్యేకంగా సమర్పిస్తున్నారన్నారు. మొత్తం ప్యాకేజీగా 2 సి.డి.లు, పాటల పుస్తకంతో కలిపి వెల రూ. 100/- ధర నిర్ణయించినట్లు నారాయణ అన్నారు.

# అష్టోత్తరశత నామావళి

**అనువాదము, కూర్పు- నిరాకారరావు వేల్పుల**

*మీరు నమ్ముతారో, లేదో కానీ, మెహెర్‌బాబా స్వయంగా ఈ నామావళిని నిత్యం పఠించమని తన ప్రేమికులను ఆదేశించారు. ఈ నామాలను మనసా, వాచా స్మరించమని మెహెర్‌బాబా పేర్కొన్నారు. ఇందుకోసం లార్డ్ మెహెర్ - న్యూ ఎడిషన్ - వాల్యూం-8 లోని పేజీ నెంబరు. 4381-4183 పరిశీలించండి.*

*కాగా, జాల్ దస్తూర్, మెహెరాబాద్ మా ప్రతినిధితో మాట్లాడుతూ ఈ నామావళి బాబా ప్రార్థనలు పఠించడంతో సమానం అని బాబా వారితో స్వయంగా అన్నట్లు తెలిపారు. మహిళలు పలువురు శ్రావణ శుక్రవారం వంటి శుభసమయాలలో ఈ నామావళిని పఠిస్తున్నట్లు తెలిపారు. మీరూ ప్రయత్నించి చూడండి......*

| | |
|---|---|
| 1 Worthy of Worship | పూజార్హుడవు |
| 2 All-Powerful | సర్వశక్తి మయుడవు |
| 3 All-Knowing | సర్వజ్ఞుడవు |
| 4 Lord of All | సర్వేశ్వరుడవు |
| 5 Without Beginning | ఆది లేనివాడవు |
| 6 Without End | అంతయులేని వాడవు |
| 7. Root of Creation | సృష్టకి మూల మీవు |
| 8 Endless Bliss | అనంతానంద స్వరూప |
| 9 Primal Cause | మూల కారణుడవు |
| 10 Exalted One | మహోన్నతుడవు |
| 11 Purest of the Pure | పరమ పావనుడవు |
| 12 Detached from All | సర్వసంగరహితుడవు |
| 13 In Touch with All | సర్వసంగ సహితడవు |
| 14 Unattainable | అసాధ్యుడవగు |
| 15 Attainer of All | సాధ్యము సర్వము నీకు |
| 16 Most Righteous | మహా ధర్మ స్వరూప |
| 17 Upholder of All | విశ్వమును భరించు |
| 18 Beyond Reason | మహోన్నత కారణుడవు |

| | |
|---|---|
| 19 Sovereign Reason | సర్వ సంపన్నుడవు |
| 20 Bountiful One | ఊహాతీతుడవు |
| 21 Ever-Prolific | నిత్య సమృద్ధుడవు |
| 22 Reaching Equally to All | సర్వులకు సన్నిహితుడవు |
| 23 Nourisher | సర్వపోషకుడవు |
| 24 Protector of the World | జగద్రక్షకుడవు |
| 25 Never-Changing | మార్పు లేనివాడవు |
| 26 Formless | నిరాకారుడ నీవు |
| 27 Most Steadfast among the Steadfast | స్థిరములందు సుస్థిరుడవు |
| 28 Lord Invisible | అవ్యక్త స్వరూపుడవు |
| 29 All-Pervading | సర్వ వ్యాపకుడవు |
| 30 All-in-All | సర్వమయుండవు |
| 31 Worthy of our Profound Thanks | మా కృతజ్ఞతల కర్హుడవు |
| 32 All-Embracing Goodness | అందరిని బ్రోచు సద్గుణ నిధివి |
| 33 All-Embracing Holy.Light | అందరిని బ్రోచు పావన జ్యోతివి |
| 34 Remover of Affliction | క్లేశ నివారణుడవు |
| 35 Beyond Affliction | క్లేశముల కతీతుడవు |
| 36 Immortal | శాశ్వతుడ నీవు |
| 37 Fulfiller of Holy Desires | పవిత్రాశలదీర్చువాడవు |
| 38 Creat or of Holy Attributes | పవిత్రగుణముల ప్రధాతవు |
| 39 Compassionate Judge | కరుణామయ న్యాయమూర్తి |
| 40 Merciful Giver | దయామయుడౌ దాతవు |
| 41 Bountiful Giver | సుపంపన్నువౌ దాతవు |
| 42 Unconquerable | అజేయుడ నీవు |
| 43 Freest of the Free | సర్వ స్వతంత్రుడవు |
| 44 Deliverer from Evil | దుష్ట గ్రహ విమోచనుడవు |
| 45 Never Deceiving | ఎన్నడు మోసగించని వాడవు |
| 46 Never Deceived | ఎన్నడు మోసపోని వాడవు |
| 47 One without a Second | అద్వితీయుడవు |
| 48 Lord of Desire | కోర్కెలపై ప్రభుడవు |
| 49 Decreer of Sovereign Desire | ఉన్నత కోర్కెల నిర్దేశకుడవు |
| 50 Soul Supreme | పరమాత్ముడవీవు |

| | |
|---|---|
| 51 Never.- Forgetting | ఎన్నడు మరువని వాడవు |
| 52 Just Accountant | న్యాయమౌ గణికుడవు |
| 53 Knowing All Things | సకల వేద్యుడవీవు |
| 54 Fearless | నిర్భయుడవీవు |
| 55 Devoid of Pain | బాధారహితుడవు |
| 56 Most Exalted One | సర్వోన్నతుడవీవు |
| 57 Ever the same | నిత్యమొకే రీతి నుండు వాడవు |
| 58 Invisible Creator of the Universe | అదృశ్య నిర్మాతవు |
| 59 Creator of the Profoundly Spiritual | పూర్ణ ఆత్మ నిర్మాతవు |
| 60 Hidden within the Spirit | ఆత్మలో గుప్తమైయుండు |
| 61 Transmuter of Fire into Air | అగ్నిని వాయువుగ మార్చుగల |
| 62 Transmuter of Fire into Dew | అగ్నిని మంచుగ చేయగల |
| 63 Transmuter of Air into fire | గాలిని అగ్నిగ చేయగల |
| 64 Transmuter of Air into Dew | గాలిని మంచుగ మార్చగల |
| 65 Transmuter of Air into Earth | గాలిని మట్టిగ మార్చగల |
| 66 Supreme Transmuter of Air into Dust | గాలిని ధూళిగ చేయగల |
| 67 Supreme Transmuter of Fire into Divine Sparks | అగ్నిని దివ్యకణములగ మార్చు |
| 68 Spreading Air Everywhere | గాలినంతటిని వ్యాప్తిచేయు |
| 69 Creator of Life-Giving water | ప్రాణప్రదమౌ జలమును సృజించు |
| 70 Transmuter of Dust into Fire | ధూళిని అగ్నిగ మార్చు |
| 71 Transmuter of Dust into'Air | ధూళిని గాలిగ మార్చు |
| 72 Transmuter of Dust into Water | ధూళిని జలముగజేయు |
| 73 Master Craftsman | కళా ప్రపూర్ణుడవు |
| 74 Rewarder of Sincere Desires | మంచి కోర్కెల నొసంగు |
| 75 Creator of all Humanity and Its Actions | మానవాళిని కర్మలను సృజించు |
| 76 Creator of all Human and Animal Life | సకలమానవులనుజంతువులను సృజించు |
| 77 Creator of all Four Elements | నాలుగు ధావులను సృజించు |
| 78 Creator of all the Planets and all other Worlds | అన్ని గ్రహములను జగాలను సృజించు |

| | |
|---|---|
| 79 Never in Doubt | ఎన్నడు సంశయించని వాడవు |
| 80 Ageless | వయోపరిమితి లేని వాడవు |
| 81 Eternally Awake | శాశ్వతముగ మేల్కొనియుండు |
| 82 Ever-Alert | నిత్యము జాగరూకుడవు |
| 83 Ever-Protecting | నిత్య సంరక్షకుడవు |
| 84 Recorder of Man's Actions | మానవాళి కర్మలను వ్రాయు |
| 85 Victorious | దిగ్విజయుడ వీవు |
| 86 Lord of the Universe | విశ్వనాధుడవు |
| 87 Lord of Life and Wisdom | ప్రాణవివేకముల నాధుడవు |
| 88 Preserver of Creation | సృష్టి సంరక్షకుడవు |
| 89 Renewer of Creation | సృష్టిని పరిపుష్టిచేయు |
| 90 Embracing All Creation | సృష్టినంతటిని కౌగిట చేర్చు |
| 91 Giverof All Things | సర్వము నొసగు వాడవు |
| 92 Infinitely Patient | అపార సహన శీలుడవు |
| 93 Lord of existence | ఉన్నదంటికిని స్వామిది |
| 94 Forgiver of Sins | పాపమును క్షమియించు |
| 95 Divine Creator | దివ్యమౌ సృష్టికారక |
| 96 Rayed in Glory | ఘనతతో భాసిల్లు |
| 97 Haloed in Light | దివ్య తేజస్వరూపుడవు |
| 98 Lord of Justice | న్యాయాధీశుడవు |
| 99 Lord of Just Rewards | న్యాయ పురస్కారముల ప్రభుడవు |
| 100 Liberator | మోక్ష ప్రదాత వీవు |
| 101 Awakener of Eternal Spring | శాశ్వతత్వమును మేల్కొల్పు |
| 102 మత్స్య కూర్మ వరాహ స్వరూప | శ్రీ మెహెర్ బాబా జైమెహెర్‌బాబా |
| 103 నారసింహ వామనావతార | ” ” |
| 104 జొరాస్టరు స్వరూపుడవు | ” ” |
| 105 శ్రీరామ శ్రీకృష్ణావతార | ” ” |
| 106 గౌతమ బుద్ధావతార | ” ” |
| 107 ఏసు మహమ్మదు స్వరూప | ” ” |
| 108 సర్వోన్నత మౌనావతార | ” ” |

**శ్రీ మెహెర్ జై మెహెర్ జై జై మెహెర్**

## కరీంనగర్ జిల్లాలో మెహెర్‌బాబా జీవిత సభ్యులు

**2002 – ఏప్రిల్ 2015 వరకు,**

| | | | |
|---|---|---|---|
| 1 | Venktaramana Reddy. P | Jun, 02 | 1000 |
| 2 | Sriranga Rao, | Mar, 04 | 1000 |
| 3 | Krishna Rao | Apr, 05 | 1000 |
| 4 | Kamatala Srinivas, SIRCILLA | Aug, 05 | 1000 |
| 5 | B. Meher Prakash, | Sept, 06 | 1000 |
| 6 | T. Krishna Murthy, Godavari Khani | Feb.08 | 1000 |
| 7 | P. Meheranand, Sircilla | June, 08 | 1000 |
| 8 | Chakkilam Rajesham, Sircilla | Feb, 09 | 1000 |
| 9 | K. Bhasker Reddy | April, 09 | 1000 |
| 10 | P. Pavan Kumar | Feb. 11 | 1000 |
| 11 | Konda Srikanth, Sirsilla tfd to HYD | Aug,11 | 1000 |
| 12 | Chekoti Deviah, Sirsilla | April, 12 | 1000 |
| 13 | B. Eknadh, Sirsilla | April, 12 | 1000 |
| 14 | K. Yaikuntam, Sirsilla | April, 12 | 1000 |
| 15 | Y. Srinivasa Rao, Sirsilla | April, 12 | 1000 |
| 16 | G. Srikanth, Sirsilla | April, 12 | 1000 |
| 17 | U. Purnachandar, Sirsilla | April, 12 | 1000 |
| 18 | K. Sambaiah, sirsilla | May, 12 | 1000 |
| 19 | E. Venkatesam, Sirsilla | May, 12 | 1000 |
| 20 | T. Ashok Kumar | May, 12 | 1000 |
| 21 | Akkinapalli Rajaiah, Beripuri | Oct - 13 | 1000 |
| 22 | S. Veera Hanuman Reddy | Dec - 13 | 1000 |

## జీవిత సభ్యత్వం రెండు దఫాలుగా చెల్లించినవారి వివరములు

**2002 – ఏప్రిల్ 2015 వరకు, కరీంనగర్**

| | | | |
|---|---|---|---|
| 23 | Gabbula Sreenivas, GodavariKhani | Feb, 09 | 200 |
| | Gabbula Sreenivas, GodavariKhani | Feb. 11 | 800 |

| | | | |
|---|---|---|---|
| 24 | Kailasam T. | Feb, 04 | 500 |
| | Kailasam T. Godavarkhani | Dec, 04 | 500 |
| 25 | M. Venkatesham, | Feb.08 | 500 |
| | M.Venkatesham, | Feb, 09 | 500 |
| 26 | N. Narasimha Swamy, Jammikunta | Aug, 09 | 500 |
| | N. Narasimha Swamy, Jammikunta | Feb, 12 | 500 |
| 27 | N. Raja Babu, Godavarikhani | Feb, 09 | 500 |
| | N. Raja babu, Janagoam, | July, 08 | 500 |
| 28 | Rammohan Rao N. | Feb, 04 | 500 |
| | Rammohanrao .V. Godavari Khani | Dec, 04 | 500 |
| 29 | Samala Rajamallaiah | Jan, 07 | 500 |
| | Samala Rajamallaiah, Sirisilla | May, 07 | 500 |
| 30 | Balaji Ambedkar Show Room | Apr, 03 | 500 |
| | Balaji Ambedkar Show Room | Jun, 06 | 500 |
| 31 | D. Srinivas, Sirsilla | Feb, 12 | 500 |
| | Dasari Srinivas | Feb - 14 | 500 |

## జీవిత సభ్యత్వం కొరకు ఒక దఫా మాత్రమే చెల్లించినవారి వివరములు

**2002 – ఏప్రిల్ 2015 వరకు, కరీంనగర్**

| | | | |
|---|---|---|---|
| 1 | Akula Ramesh | Feb, 09 | 500 |
| 2 | Baddepuri Shanker | May, 11 | 500 |
| 3 | Ch. Janardhan | Aug. 08 | 500 |
| 4 | D. Srinivas, Sirsilla | Feb, 12 | 500 |
| 5 | G. Suresh, Ramagundam | April, 12 | 500 |
| 6 | Ganna Padma Reddy, Yellareddypet | Jan. 11 | 500 |
| 7 | K. Vijaya Narsingarao | Mar, 12 | 500 |
| 8 | Kotesh Goud | Nov, 12 | 500 |
| 9 | Lakshmi Narsimha Rao. N | Nov, 05 | 500 |
| 10 | P. Raja Reddy, Kareemnagar | Mar, 09 | 500 |
| 11 | Rajendar | Nov, 12 | 500 |
| 12 | Y. Srinivas | Aug.08 | 700 |
| 13 | G. Srinivas | Feb - 14 | 500 |

## జీవిత సభ్యతం

**2015 మార్చి - ఏప్రిల్ నెలలో పంపిన వారి వివరాలు**

| నెం. | | పేరు, ప్రాంతము | చెల్లించిన సొమ్ము |
|---|---|---|---|
| 1. | మార్చి | ఎ. సాయన్న, హైదరాబాద్ | రూ. 1000.00 |
| 2. | మార్చి | ఎల్. లక్ష్మి, హైదరాబాద్ | రూ. 1000.00 |
| 3. | మార్చి | **ఎన్. రమణ, ఖమ్మం** | రూ. 1000.00 |
| | | మొత్తం | **రూ. 3000.00** |

# మెహెర్‌బాబా పత్రిక

మెహెర్‌బాబా పత్రిక జీవిత సభ్యత్వం రూ. 1000/-. ఆన్‌లైన్‌లో పంపగోరువారు శ్రీమతి శారద, ఇండియన్ ఓవర్సీస్ బ్యాంకు, సైనిక్‌పురి బ్రాంచి, సికింద్రాబాద్.
**SB A/C NO: 173201000027973. IFSC CODE: IOBA 0001732.**

## మా అడ్రస్:

ఎడిటర్, మెహెర్‌బాబా,
గోదావరి గార్డెన్స్, బాబాస్ హౌస్,
యాప్రాల్, ప్లాట్ నెం. 32,
జె.జె. నగర్ కాలనీ పోస్టు
సికింద్రాబాద్-500087
ఫోన్: 99595-53218,
**email: malladisukku@gmail.com**

Printed and published and owned by Dasika Nirmaladevi printed at Sai Srinivasa Printers, Khairatabad, Hyderabad, published at Koti Meher Centre, Esamia Bazar, Koti, behind Govt. Women's College, Hyderabad.

**Editor: D. Nirmaladevi**

RNI No. APTEL/2002/7310, Postal Concession: R&D/RNP/HSE/789/2014-2016, **Dt.06-01-2014,** Date of Publication 17th of every month